# కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 19, మే 2026 | 16 పేజీలు






16లో

## 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

### రూ.237 కోట్లు రైతుల ఖాతాల్లో జరైతులకు ఇబ్బందులు రానివ్వం : మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త: కరీంనగర్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, వచ్చేవారం లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా నిర్దేశించామని, ఇప్పటి వరకు రైతులకు 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.


































# పట్టణ ప్రజల కోరిక మేరకే డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ తీర్మానం

### పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

### 44 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం

**పెద్దపల్లి, ప్రభాతవార్త:**

పట్టణ ప్రజల కోరిక మేరకే డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ తీర్మానం చేసినట్లు మున్సిపల్ కార్యాలయం మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అత్యంత కీలకమైన చర్చలతో నిర్వహించడం జరిగింది. ఈ మున్సిపల్ సాధారణ సమావేశంలో వివిధ వార్డుల అభివృద్ధి పనులకు సంబంధించిన మొత్తం 44 అంశాలను చర్చకు పెట్టగా, వాటికి కౌన్సిల్ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఇందులో భాగంగానే పట్టణంలో అత్యంత ప్రధానమైన సమస్యగా మారిన జెండా చౌరస్తా నుండి పెద్ద మజీద్ రోడ్డు వరకు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తు పట్టణ అభివృద్ధి మరియు నిరంతరం ఎదురవుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత రహదారిపై తీవ్ర ట్రాఫిక్ అంతరాయాలు కలుగుతున్నందున, పట్టణ ప్రజల కోరిక మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ శాఖ హైదరాబాద్ ద్వారా ఆమోదించబడిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం సదరు రోడ్డును 60 అడుగులుగా విస్తరించడానికి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. ఈ మున్సిపల్ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాబోయే రోజుల్లో పట్టణ రూపురేఖలు మారిపోతాయని, ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని మున్సిపల్ కార్యాలయం మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సభ్యులందరూ పట్టణ ప్రగతికి ఇలాగే సహకరించాలని కోరారు. ఈ అధికారిక మున్సిపల్ సాధారణ సమావేశ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ముస్కాన్ నాజ్ నాయ్యర్ అలీ మరియు వివిధ వార్డుల కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, జూనియర్ అసిస్టెంట్లు జనార్ధన్, రమాకాంత్, సురేందర్ మరియు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు పట్టుదలే ప్రధాన ఆయుధం

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:**

ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు పట్టుదలే ప్రధాన ఆయుధం అని కలెక్టరేట్ కార్యాలయం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చెప్పారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో పోలీస్ యువశక్తి ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా యువత కోసం పోలీస్, ఎస్సై, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల కొరకు నిర్వహించిన మెగా మాక్ టెస్ట్ మరియు ఈవెంట్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రథమ బహుమతి కింద రూ.10000, ద్వితీయ బహుమతి కింద రూ.5000 నగదు చెక్కులను కలెక్టరేట్ కార్యాలయం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల పట్ల యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రాబోయే నోటిఫికేషన్లకు సమర్థంగా సిద్ధమై ఉద్యోగాలు సాధించాలని సూచించారు.




లక్ష్య సాధనకు వ్యక్తిగత శిక్షణ, క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన ఎంతగానో ఉపయోగపడుతుందని, పట్టుదలతో కృషి చేస్తే తప్పకుండా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగలరని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా యువతకు ఉపయోగపడే విధంగా మరిన్ని ఉచిత శిక్షణా కార్యక్రమాలు జిల్లా యంత్రాంగం తరఫున నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, పోలీస్ యువశక్తి కార్యక్రమం కోఆర్డినేటర్ లెంకల మహిపాల్ రెడ్డి ఎక్స్ ఆర్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఓబీ పనుల్లో అక్రమాలకు చెక్

### సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో కాంట్రాక్టర్లపై ఉక్కుపాదం

**గోదావరిఖని, ప్రభాతవార్త:** సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ (మట్టి తొలగింపు) పనుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. కోట్ల రూపాయల విలువైన ఈ పనుల్లో నిర్లక్ష్యం, లక్ష్యాల అమలులో వైఫల్యం, నిబంధనల ఉల్లంఘనలు, సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకొని జరుగుతున్న అక్రమాలపై సింగరేణి యాజమాన్యం కఠిన చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇటీవల ఒక గుత్తేదారు సంస్థను బ్లాక్‌లిస్టులో చేర్చిన ఘటనతో గనుల వర్గాల్లో కలకలం రేగింది. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఓపెన్‌కాస్ట్ గనులే ప్రధాన ఆధారం. అయితే బొగ్గును వెలికి తీయాలంటే ముందుగా భారీ మొత్తంలో మట్టిని తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను ఓబీ పనులుగా పిలుస్తారు. లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించే ఈ పనులు ప్రైవేటు గుత్తేదారు సంస్థలకు అప్పగిస్తుంటారు. కానీ గత కొన్నేళ్లుగా అనేక గనుల్లో ఈ పనులు సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంచిర్యాల జిల్లా ఇందారం ఉపరితల గనిలో మూడేళ్లలో 704 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించే బాధ్యత ఒక గుత్తేదారు సంస్థకు అప్పగించారు. కానీ ఒప్పందంలో పేర్కొన్న లక్ష్యాలకు అనుగుణంగా పనులు జరగకపోవడంతో యాజమాన్యం పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో పనులను నిలిపివేసినట్లు తెలిసింది. అంతేకాకుండా బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడే స్థాయిలో ఆలస్యం జరగడంతో జరిమానాలు కూడా విధించినట్లు సమాచారం. సింగరేణి వర్గాల సమాచారం ప్రకారం, గతంలో ఓబీ పనుల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని చెబుతున్నారు. టెండర్లలో ఒక లీడ్ చూపించి, క్షేత్రస్థాయిలో మరో విధంగా మట్టి తరలింపులు చేయడం, రవాణా దూరాలను మార్చి అదనపు బిల్లులు పొందడం, పనుల పురోగతిని కాగితాలపైనే చూపించడం వంటి ఆరోపణలు



పలు గనుల్లో వినిపించాయి. కొన్ని కంపెనీలు రాజకీయ, అధికార పలుకుబడిని ఉపయోగించి చర్యల నుంచి తప్పించుకున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ పనులు ఆలస్యం కావడం వల్ల బొగ్గు ఉత్పత్తి పూర్తిగా దెబ్బతింటోంది. మట్టి తొలగించకుండా బొగ్గు పొరలను చేరుకోవడం అసాధ్యం కావడంతో ఉత్పత్తి లక్ష్యాలు తగ్గిపోతున్నాయి. దీని ప్రభావం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలపై కూడా పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సకాలంలో బొగ్గు సరఫరా జరగకపోతే విద్యుత్ రంగంపైనా ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సింగరేణి యాజమాన్యం ఇప్పుడు కఠిన వైఖరి అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. గనుల స్థాయిలో ఓబీ పనులపై ప్రత్యేక పర్యవేక్షణ ప్రారంభించినట్లు సమాచారం. రోజువారీ మట్టి తొలగింపు వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయడం, జీపీఎస్ ఆధారిత వాహనాల పర్యవేక్షణ, డ్రోన్ సర్వేలు, క్షేత్రస్థాయి తనిఖీలు పెంచడం వంటి చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా పనులు సక్రమంగా చేయని సంస్థలను భవిష్యత్తులో టెండర్లకు దూరం పెట్టే విధంగా కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల బ్లాక్‌లిస్టులో చేర్చిన సంస్థపై తీసుకున్న నిర్ణయం కూడా ఇదే దిశగా కీలక చర్యగా భావిస్తున్నారు. ఇకపై ఒప్పంద నిబంధనలు పాటించని సంస్థలపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. సింగరేణిలో ఓబీ పనులు పారదర్శకంగా, వేగంగా జరిగితేనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు చేరుకోవచ్చని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. అక్రమాలు, నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేయాలని కార్మికులు, ప్రజా సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు భవిష్యత్తులో గనుల పనితీరుపై ఎంత ప్రభావం చూపుతాయో చూడాల్సి ఉంది.

# గంగాదేవి ఆలయ ఆవరణలో డంపింగ్‌తో పారిశుద్ధ్య లోపం గ్రామ కార్యదర్శికి వినతి

**రామగిరి ప్రభాతవార్త** రామగిరి మండలం బేగంపేట గ్రామ శివారులోని బీరన్న గంగాదేవి ఆలయ ఆవరణలో చెత్త డంపింగ్ తో పారిశుద్ధం లోపిస్తుందని గ్రామ కార్యదర్శి రత్నాకర్ కు గొల్ల కుర్మ యాదవ సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆలయ సమీపంలో చెట్లు, చెత్తాచెదారం తో పాటు చెత్త డంపింగ్ చేయడం వల్ల పారిశుద్ధం లోపించి కాలుష్యం పెరుగుతుందని వెంటనే డంపింగ్ యార్డ్‌ను తొలగించి ఆలయ సమీపంలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు.



# ఈఏపీసెట్‌లో శ్రీ కాకతీయ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

**గోదావరిఖని, ప్రభాతవార్త:**



గోదావరిఖని పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ అయిన శ్రీ కాకతీయ ఐఐటీజేఈఈ, నీట్ ఈఏపీసెట్ అకాడమీ మరోసారి ఉత్తమ ఫలితాలతో తన ప్రత్యేకతను చాటుకుంది. ఇటీవల విడుదలైన ఈఏపీసెట్ ఫలితాల్లో ఈ సంస్థకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించారు. ముఖ్యంగా ఈ విద్యాసంస్థ నుండి పరీక్ష రాసిన విద్యార్థుల్లో సుమారు 90 శాతం మంది అర్హత సాధించడం విశేషంగా నిలిచింది. విద్యార్థులకు నాణ్యమైన బోధన, అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శనం, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, ప్రత్యేక పరీక్షల నిర్వహణ వంటి అంశాల వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అకాడమీ యాజమాన్యం తెలిపింది. ఐఐటీజేఈఈ, నీట్ మరియు ఈఏపీసెట్ పోటీ పరీక్షల్లో విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొంది. ఈఏపీసెట్‌లో సంస్థకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి మంచి ర్యాంకులు సాధించి తల్లిదండ్రులు, అధ్యాపకులకు గర్వకారణమయ్యారు. ఎ. జాయ్ ప్రశాంత్ 4778 ర్యాంక్ సాధించగా, టి. మనస్విని 7059 ర్యాంక్, ఆర్. భువనకృతి 7386 ర్యాంక్ సాధించారు. అలాగే ఎ. వర్షిత 10221, ఎస్. ఈశ్వర్ 11603, జయస్మ 12180 ర్యాంకులతో ప్రతిభ చాటారు. ఇంకా సుమయ్య షాహరూన్ 12872, కె. సహస్ర 16576, ఎన్. సాయి శ్రీనివాస్ 18274, అక్సా ఆన్ సురేష్ 19561, నిషాద్ అఫ్రీన్ 19871 ర్యాంకులు సాధించి సంస్థ ఖ్యాతిని మరింత పెంచారు. విజయం సాధించిన విద్యార్థులను అకాడమీ యాజమాన్యం, అధ్యాపకులు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు అకాడమీ ప్రకటించింది. పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ఆసక్తి గల వారు 7901400066, 7901300066, 9010468680 నంబర్లను సంప్రదించాలని తెలిపింది... స్ఫూర్తిదాయక నినాదంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు అకాడమీ కృషి చేస్తోందని నిర్వాహకులుఆకుల శ్రీనివాస్ వెల్లడించారు.

# వడ్ల పోక కుప్పల వద్దనే రైతుల పడి కాపులు

### పట్టించుకోని నిర్వాహకులు



**ఓదెల, ప్రభాతవార్త:** ఓదెల మండల కేంద్రంలోని తారకరామ కాలనీ నుండి కొలనూర్ వెళ్లే ప్రధాన రహదారిపై గత 40 రోజులుగా వడ్ల కుప్పలు పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంటా ఏర్పాటు ఆలస్యం కావడంతో రెండు కిలోమీటర్ల మేర ధాన్యం రహదారిపైనే నిల్వ ఉండిపోయింది. అరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే పరిస్థితి లేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు, అకాల వర్షాలు, గాలులతో వడ్లు తడిసి నాణ్యత కోల్పోతున్నాయని రైతులు చెబుతున్నారు. రాత్రింబవళ్లు వడ్ల కుప్పల వద్దే కాపలా కాస్తూ రైతులు బతుకుదెరువు కోసం పోరాడుతున్నారు. ధాన్యం లిఫ్టింగ్‌లో జాప్యం, లారీల కొరత, కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యం కారణంగా గన్ని బ్యాగ్స్ ఇవ్వక నిర్వాకులు పట్టించుకోకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గన్ని బ్యాగ్స్ ఇచ్చి కాంటా ఏర్పాటు చేసి వడ్ల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా ప్రారంభమైన 'విష్ణు పురాణ ప్రవచన సప్తాహం

**జగిత్యాల అర్బన్ ప్రభాతవార్త**

స్థానిక జిల్లా కేంద్రం కృష్ణా నగర్‌లోని ఉమా శంకర్ గార్డెన్స్‌లో 'విష్ణు పురాణ ప్రవచన సప్తాహం' అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మంచిర్యాల వాస్తవ్యులు, ప్రముఖ పౌరాణిక, వేద పండితులు బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఘనంగా మొదలైంది. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమ ప్రారంభ సూచికగా ప్రముఖ పౌరాణిక వేద పండితులు బుర్రా భాస్కర శర్మతో పాటు తీగుల్ల విష్ణు శర్మ, పాలేపు చంద్రశేఖర్ శర్మ, నంబి చిన్ను స్వామి సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమ విశిష్టతను గూర్చి ప్రసంగించారు ఆకట్టుకున్న ప్రవచనాలు సప్తాహంలో ఖులతో పాటు సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రం పాల్గొన్నారు. ఈ ప్రవచన కార్యక్రమానికి జిల్లా కేంద్రం నలుమూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకుల తరపున విచ్చేసిన భక్తులు, అతిథులందరికీ అల్పాహార ప్యాకెట్లను పంపిణీగంగా మొదటి రోజు బుర్రా భాస్కర శర్మ ప్రవచిస్తూ.. పురాణ పాత్ర అయిన సత్యవతి జననం గురించిన ఘట్టాన్ని భక్తులకు కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నిర్వాహకులు ఊటూరి అశోక్ కుమార్ రమాదేవి దంపతులు, ఊటూరి ఓంకార్ నవత దంపత చేశారు.

# దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్

### ఆన్‌లైన్ మందుల అమ్మకాలపై కెమిస్టుల ఆగ్రహం

### మే 20న 12 లక్షలకుపైగా దుకాణాలు మూసివేతకు పిలుపు

**గోదావరిఖని ,ప్రభాతవార్త:**

దేశవ్యాప్తంగా మే 20, 2026 బుధవారం రోజున మెడికల్ షాపులు బంద్ కానున్నాయి. ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలను నిరసిస్తూ 'ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్' ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలోని చిన్న, మధ్య తరహా మెడికల్ షాపుల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు వెల్లడించారు.దేశవ్యాప్తంగా సుమారు 12.40 లక్షలకు పైగా మెడికల్ దుకాణాలు ఈ నిరసనలో పాల్గొనే అవకాశముందని పేర్కొన్నారు. దీంతో ఒక రోజు పాటు మందుల కొనుగోలులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా నిత్యం మందులు వాడే రోగులు ముందుగానే అవసరమైన మందులను కొనుగోలు చేసి ఉంచుకోవాలని వైద్య వర్గాలు సూచిస్తున్నాయి.ఆన్‌లైన్ ఫార్మసీలు వైద్యుల ప్రిస్క్రిప్షన్లను సరైన విధంగా పరిశీలించకుండా మందులు విక్రయిస్తున్నాయని కెమిస్టుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇది ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని పేర్కొంటున్నాయి. ముఖ్యంగా యాంటీబయాటిక్స్, నిద్ర మాత్రలు, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన మందులు నియంత్రణ లేకుండా విక్రయిస్తే దుర్వినియోగం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.అదేవిధంగా భారీ డిస్కౌంట్ల పేరుతో ఆన్‌లైన్ సంస్థలు వ్యాపారం నిర్వహించడం వల్ల చిన్న మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. పట్టణాలు, గ్రామాల్లో కుటుంబాల ఆధారంగా నడుస్తున్న వేలాది ఫార్మసీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపింది. ఆన్‌లైన్ కంపెనీలు పెట్టుబడుల బలంతో మార్కెట్‌ను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించింది.ప్రస్తుతం దేశంలో మెడికల్ షాపులు కేవలం వ్యాపార కేంద్రాలుగానే కాకుండా అత్యవసర ఆరోగ్య సేవలలో కీలక పాత్ర పోషిస్తున్నాయని సంఘం నాయకులు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మందులు అందుబాటులో ఉంచే బాధ్యతను స్థానిక ఫార్మసీలు నిర్వర్తిస్తున్నాయని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో ఆన్‌లైన్ విక్రయాల కారణంగా సంప్రదాయ మెడికల్ దుకాణాలు మూతపడితే ప్రజలకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ మందుల విక్రయాలపై కఠిన నియంత్రణలు అమలు చేయాలని, ప్రిస్క్రిప్షన్ ధృవీకరణ తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా మందులు విక్రయిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దేశవ్యాప్త బంద్‌కు పిలుపునివ్వాల్సి వచ్చిందని తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రజలు అవసరమైన మందులను ముందుగానే కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, మూత్రపిండ సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. అత్యవసర వైద్య అవసరాల కోసం కొంతమంది ఆస్పత్రులలోని ఫార్మసీలు మాత్రమే పనిచేసే అవకాశం ఉందని సమాచారం.మే 20న జరిగే ఈ బంద్ దేశవ్యాప్తంగా వైద్య రంగంలో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.




## బతుకుదెరువు కోసం పోరాటం.. వడదెబ్బకు మత్స్యకారుడు బలి..

**వేములవాడ అర్బన్ ప్రభాత వార్త:**



వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామంలో వడదెబ్బకు గురై ఓ మత్స్యకారుడు చెరువు గట్టునే మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది.రుద్రవరం గ్రామానికి చెందిన తునికి హన్మండ్లు (45) వృత్తిరీత్యా మత్స్యకారుడు. ప్రతిరోజులాగే స్థానిక చెరువులో చేపల వేటకు వెళ్లిన అతను తీవ్ర ఎండలో పనిచేస్తుండగా వడదెబ్బకు గురయ్యాడు. శరీరం సహకరించక ఒడ్డుకు వచ్చేలోపే స్పృహతప్పి పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. తోటి మత్స్యకారులు గమనించి మృతదేహాన్ని బయటకు తీశారు. హన్మండ్లు మృతితో కుటుంబం రోడ్డున పడింది. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి మృతదేహాన్ని పట్టుకుని వారి రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి.ఈ ఘటన వేసవిలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తుచేస్తోంది. తీవ్ర ఎండల్లో చెరువుల్లో పని చేసే మత్స్యకారులకు బీమా, ఆరోగ్య భద్రత లేకపోవడం ఆందోళనకరం.విషయం తెలిసిన రుద్రవరం గ్రామ సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సహాయం, ఎక్స్‌గ్రేషియా అందించి అనాథలైన కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు.

## అంబాలలో ట్రాక్టర్ డ్రైవర్ అనుమానాస్పద మృతి

### -పోలీసుల దర్యాప్తు



**కమలాపూర్: ప్రభాత వార్త.**కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మాదారపు సురేష్ (40) పెరుకపల్లి శివారులోని మామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. సురేష్ తండ్రి ఎల్లయ్య. కులం రజక. వృత్తి రీత్యా అదే గ్రామానికి చెందిన బోయిని శ్రీకాంత్, తండ్రి కొమురయ్య వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా 17.05.2026 ఆదివారం ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి పనికి వెళ్లిన సురేష్ రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు.ఈ క్రమంలో అదే రోజు రాత్రి సుమారు 10 గంటల సమయంలో పెరుకపల్లి గ్రామ శివారులోని మామిడి తోటలో సురేష్ విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించారు. మృతుడి ముక్కు నుంచి రక్తం కారడంతో పాటు ఎడమ కాలు విరిగి ఉండటంతో అనుమానాస్పద మృతిగా భావించి భార్య మాదారపు సుమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ నవీన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని పేర్కొన్నారు. మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని, సీఐ తెలిపారు. ఈ ఘటనతో అంబాల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఎస్ఐఆర్ 2026పై అవగాహన

**ఓదెల,ప్రభాతవార్త:**



### -తహసిల్దార్ ధీరజ్

ఓదెల మండలంలోని రైతు వేదికలో ఎస్ఐఆర్ 2026 పై అవగాహన కార్యక్రమం మండల తహసిల్దార్ ధీరజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ25 జూన్ 2026 నుండి ఎస్ఐఆర్‌లో భాగంగా హౌస్ టూ హౌస్ సర్వే నిర్వహించడం జరుగుతుందని కావున అందరు ఓటర్స్ తమ ఉరిలోని బిఎల్ఓ ద్వారా ఓటర్ మాపింగ్ చేపించుకోవాలని కోరారు ఇందుకోసం వారు 2002 వోటర్ లిస్టులోని వారి వివరాలు (ఒక్కవేళ 2002 లో ఓటరుగా నమోదైతే ) లేదా వారి యొక్క తల్లి తండ్రులు లేదా తాత నానమ్మల వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు చివరి ఎస్ ఐ ఆర్ 2002 లో జరిగింది కావున వాటి వివరాలు ఓటర్స్. ఈ సీఐ. జి ఓ వి. ఐఎన్ ద్వారా సెర్చ్ చేసుకునే అవకాశం ఉంది అని తెలిపారు అందరూ ఓటర్సు సహకరించాలని విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్లు కనికిరెడ్డి సతీష్, గంగిశెట్టి ప్రభాకర్, రాగిడి మంగ,గోలి లింగారెడ్డి, పల్లె కనకయ్య, మధ్యనవేణి రవి తో పాటు ఇతర సర్పంచులు, ప్రజాప్రతినిధులు గిర్ధవర్లు, వివోఏలు, రేషన్ డీలర్లు, బి ఎల్ ఓ లు , జిపిఓ లు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు

## అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:**

మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన యువకుడు రాపాక రాహుల్ (25) రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాహుల్ తన మోటార్‌సైకిల్‌పై సుల్తానాబాద్ నుంచి కాట్నపల్లి వైపు వెళ్తుండగా మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో కాట్నపల్లి వైకుంఠధామం ఎదురుగా రాజీవ్ రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పింది. దీంతో డివైడర్‌ను ఢీకొని రాహుల్ రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యాడు.స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య ప్రవళికతో పాటు ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సమిష్టి కృషి తో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

### -ఆర్జీత్రీ జి.యం

**రామగిరి ప్రభాతవార్త:**



నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించడం లో భాగంగా సంబంధిత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, అంకిత భావం, సమిష్టి కృషితో, భద్రతతో విధులు నిర్వహించాలని రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తునటువంటి మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలలో భాగంగా సోమ వారం రామగుండం3 ఏరియాలోని ఓసిపి2 ఉపరితల గని లో నిర్వహించిన కార్యక్రమాన్ని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లడుతూ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించడంతోపాటు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, అంకిత భావం, సమిష్టి కృషితో అందరం భద్రతతో విధులు నిర్వహిస్తూ, ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, పెరుగుతున్న ఖర్చు లను ప్రతి ఉద్యోగి దృష్టిలో ఉంచుకొని డీజిల్ పై ఖర్చు తగ్గిస్తూ యంత్రాలను వినియోగించాలని, మరమ్మత్తులను తగ్గించాలని ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించడానికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో భాగంగా సింగరేణి సాధిస్తున్నటు వంటి ప్రగతి, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి చేసినటువంటి ప్రణాళికల గురించి సంబంధిత అధికారులు పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా సంస్థ అభివృద్ధికి సంబంధించి పలువురు ఉద్యోగులు ఇచ్చినటువంటి సలహాలు, సూచనలను సంబంధిత అధికారులు స్వీకరించారు. ఇట్టి అవగాహన సమావేశాలను మూడు బదిలీ(షిఫ్ట్స్) లలో గల ఉద్యోగులకు తెలియజేయడం జరుగుతుంది.కార్యక్ర మంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఎస్వోటుజియంలు బి.వి.సత్య నారాయణ, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ఐఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామారావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ సునీల్ ప్రసాద్, పిట్ సెక్రెటరీలు సురేష్, రామిండ్ల మనోహర్, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:**



కరీంనగర్ రూరల్ మండలం గోపాల్ పూర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వాహనాలు తనిఖీలు చేస్తుండగా అటువైపు వచ్చిన అనుమతి లేని ఇసుక ట్రాక్టర్ పోలీసులను చూసి పరారయ్యే క్రమంలో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన హరీష్ 31 ట్రాక్టర్‌లో ఇసుక అక్రమ రవాణా చేస్తుంటారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇసుక తీసుకొని వస్తుండగా గోపాలపూర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ కనిపించారు. అనుమతి లేకుండా రవాణా చేస్తున్న ఇసుక కావడంతో పోలీసులకు పట్టుబడతానని భయపడి దారి మళ్లించి పొలాల గుండా వెళ్ళిపోయాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడడంతో హరీష్ తీవ్ర గాయాలై మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని హరీష్ ను ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు హరీష్ కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసుల భయంతోనే తప్పించుకునే క్రమంలో మృతి చెందినట్లు గ్రామస్తులు ఆరోపిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు నచ్చజెప్పి కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## డిసీఎం ఢీ కొని రైతు మృతి

**తిమ్మాపూర్, ప్రభాత వార్త:**



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ రాజీవ్ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సంఘటన వివరాలు స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు కరీంనగర్ వైపు నుంచి గన్నేరువరం వెళ్తున్న ట్రాక్టర్‌ని నుస్తులాపూర్ శివారులోకి రాగానే వెనుక నుంచి డీసీఎం వాహనం ఢీ కోట్టింది. ఈ ప్రమాదంలో గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన రైతు కాంతాల రాజిరెడ్డి (58) తీవ్ర గాయాలు అయ్యి సంఘటన స్థలం లో మృతి చెందారు.ఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాక్టర్‌ని వెనుక నుంచి ఢీ కొట్టిన గుర్తు తెలియని వాహనం :ఒకరు మృతి

**తిమ్మాపూర్, ప్రభాత వార్త:**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నూస్తులాపూర్ రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.. కరీంనగర్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ ని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా ట్రాక్టర్ పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు..పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన వ్యక్తి గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## బ్లాక్ బెల్ట్ సాధించిన 8 మంది విద్యార్థులు

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :



ఈనెల 17న కరీంనగర్‌లో నిర్వహించిన ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో కోరుట్లకు చెందిన ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన 8 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ సాధించారు. ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచిన కరాటే కోచ్ అల్లే రమేష్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.గత కొన్ని సంవత్సరాలుగా కరాటే రంగంలో విశేష అనుభవం కలిగిన అల్లే రమేష్, విద్యార్థులకు కేవలం మార్షల్ ఆర్ట్స్ శిక్షణ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక దృఢత్వం వంటి విలువలను కూడా బోధిస్తూ ఎంతో మంది యువతకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నారు. ఆయన శిక్షణలో అనేక మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ విజయాలు సాధిస్తున్నారు. కఠిన సాధనతో పాటు విద్యార్థుల్లో ధైర్యం, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడం ఆయన ప్రత్యేకతగా గుర్తింపు పొందిందన్నారు. పట్టణానికి చెందిన అల్లే రష్మిత, ఇల్లెందుల మధురిమ, మందుల జాహ్నవి, కట్కం జ్యోత్స్న, కొండోజి విశ్వనాథం, జగ్గాల షణ్ముఖ్, వరుణ్ గోడికె, రిషికేశ్ సంకు లు విజేతలుగా నిలిచి,, సర్టిఫికెట్లను, బ్లాక్ బెల్ట్ లను తెలంగాణ చీఫ్ కె. వసంత్ కుమార్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్లు పుల్లూరి శ్రీనివాస్, హేమంత్, కిషోర్ పాల్గొన్నారు.

## కోరుట్ల గడి స్థలాలను రక్షించండి



కోరుట్ల, ప్రభాతవార్త :

కోరుట్ల పట్టణంలోని చారిత్రక గడి స్థలాల్లో నకిలీ దస్తావేజులతో అక్రమంగా వేసిన విఎల్టీలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు కోరుట్ల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, గడి స్థలాల విచారణ అధికారి జీవాకర్ రెడ్డికి సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ కౌన్సిలర్ల పూర్తి మద్దతుతో చేసిన సంతకాల ప్రతులను ఆర్డీవో కు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కోరుట్ల గడి బురుజులు, కోనేరు సంబంధిత స్థలాలు చాళుక్య-జైనుల కాలం నాటి చారిత్రక వారసత్వ సంపద అని తెలిపారు. ఈ ప్రజా ఆస్తులను కొంతమంది నకిలీ దస్తావేజులతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ ఇంటి నెంబర్ 64228 ఆధారంగా 5,800 గజాల భూమిపై చట్ట విరుద్ధంగా కమీషనర్ తో లోపాయికారీ ఒప్పందం చేసుకుని విఎల్టీలు పొందారని ఆరోపించారు. ఈ అం శంపై ప్రజలు, అఖిలపక్ష ప్రజాసంఘాలు ఇప్పటికే అనేక దశల్లో నిరసనలు, దీక్షలు, రాస్తారోకోలు నిర్వహించాయని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి మద్దతుగా కోరుట్ల మున్సిపల్ పరిధిలోని అన్ని పార్టీల కౌన్సిలర్లు, అధికార కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ చైర్మన్, మాజీ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు అక్రమ విఎల్టీలను రద్దు చేయాలని ఏకగ్రీవంగా సంతకాలు చేశారని పేర్కొన్నారు. పూర్తి కౌన్సిల్ మద్దతుతో కూడిన సంతకాల ప్రతులను ఆర్డీవో కు అందజేయడం ద్వారా ప్రజల ఐక్యత, గడి స్థలాల పరిరక్షణపై ఉన్న సంకల్పాన్ని స్పష్టంగా తెలియజేశారన్నారు. వెంటనే ప్రత్యేక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు ద్వారా ఈ అక్రమ అనుమతులను రద్దు చేయడానికి చట్టపరమైన బలమైన ఆధారం ఏర్పడిందని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డబ్ల్యు, తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్-2019 ప్రకారం ప్రజా ఆస్తుల పరిరక్షణ ప్రభుత్వం బాధ్యత వహించాలని గుర్తు చేశారు. అదే విధంగా అక్కడి గడి స్థలాలలో కూరగాయల మార్కెట్, పార్కు, మైసమ్మ దేవాలయం అభివృద్ధి చేయడంతో పాటు దసరా మహిషాసుర మర్ధన, బతుకమ్మ, గణేష్, మొహరం వంటి సాంప్రదాయ ఉత్సవాలు యథావిధిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ పేట భాస్కర్, ఎం డి ముజాహిద్, చెన్న విశ్వనాథం, చింత భూమేశ్వర్, సుతారి రాములు , కుంచెం శంకర్, షాహేద్ మహ్మద్ షేక్, శనిగారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## .యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



భీమారం, ప్రభాతవార్త :

భీమారం మండలంలోని రత్నాలపల్లె గ్రామంలో పోలీసులు ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్", సైబర్ క్రైమ్ అవగాహన, ట్రాఫిక్ భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు, యువత, విద్యార్థులు సమాజంలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై చైతన్యం కల్పించామన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. రహదారి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాలకు ప్రమాదంగా మారుతుందని హెచ్చరించారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు. మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ యువత తాగి వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్తో డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇస్తున్నప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాజోజి చారి, నీరటి మల్లేశం, నేరెళ్ల రాజు, జడ నడిపి గంగారం, హరీష్, గ్రామ సెక్రెటరీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు

## భూమయ్యకు కవి భూషణ అవార్డు ప్రదానం



కోరుట్ల, ప్రభాతవార్త :

అభ్యుదయ కవి రాస భూమయ్యకు కోరుట్ల పట్టణ సి. ప్రభాకర్ భవన్ ఆవరణలో కవి భూషణ అవార్డు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ కవి చిలుక ఫౌండేషన్ చిలుక గంగారం తమ సాహిత్య మిత్ర బృందంతో కలిసి సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, కోరుట్ల వెటర్నరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాధాకృష్ణ, మెట్పల్లి పట్టణానికి చెందిన సామాజిక విశ్లేషకులు న్యాయవాది తుల రాజేందర్ ముఖ్యఅతిథులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి వోటారికారి చిన్న రాజన్న, కవయిత్రి కటుకం కవిత, రాజలింగం, పోతుగంటి వెంకటేశ్వర్లు, రుద్ర నాగరాజు, వోటారికారి శ్రీనివాస్, చేన్న విశ్వనాథం,చింత భూమేశ్వర్, కట్కం రాజేశ్వర్, రాసబత్తుల రాజశేఖర్, బి. నరేందర్, లింగంపల్లి నరేష్, భూపెల్లి నాగేశ్వర్, ఉయ్యాల నర్సయ్య, సామల్ల దశరథం, ఎం. గంగాధర్, దువ్వ చంద్రశేఖర్ సివి ప్రకాష్, సామల్ల మల్లేశం, గోలి దిలీప్, తేలుకంటి గంగాధర్, సుతారి రాములు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ లు

కోరుట్ల అర్బన్, ప్రభాతవార్త :



వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని తెలంగాణ శోటోకన్ వారి ఆధ్వర్యంలో ఆల్ తెలంగాణ సీనియర్ కరాటే బెల్ట్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని కేరళ హైస్కూల్ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి అబ్దుల్ ముజిల్ కు బ్లాక్ బెల్ట్ 2వ డాన్, ఆల్ ఇండియా గ్రాండ్ మాస్టర్ గిన్నిస్ రికార్డ్ హోల్డర్ రచ్చ శ్రీనివాస్ బాబు బ్లాక్ బెల్ట్ 7 వ డాన్, భవాని చాంద్ బ్లాక్ బెల్ట్ 5 వ డాన్, జగిత్యాల డిస్ట్రిక్ట్ శోటోకన్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ మోయిస్, అరుముల్ల పవన్ జనరల్ సెక్రటరీ బ్లాక్ బెల్ట్ 5వ డాన్, మాస్టర్ ఆకాష్ బ్లాక్ బెల్ట్ 3 వ డాన్ ముజిల్ ను పాఠశాల చైర్మన్ అబ్దుల్ బారి, పాఠశాల కరెస్పాండెంట్ అబ్దుల్ హాది, ప్రిన్సిపల్ సెలిన్ బారి,అధ్యాపక బృందం అభినందించారు.అతి చిన్న వయస్సులోనే ముజిల్ బ్లాక్ బెల్ట్ 2వ డాన్ సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు.

# కోరుట్ల వార్త

## నేడు మన యువతను సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్



కథలాపూర్ ప్రభాతవార్త,

నేడు మన యువతను సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం కథలాపూర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని పిల్లల మొబైల్స్, వారి స్నేహితుల వర్గం, రాత్రి బయట తిరగడం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు, పిల్లలు డ్రగ్స్ వైపు వారి దృష్టి వెళ్లకుండా భవిష్యత్తు విషయాలు వారితో మాట్లాడాలన్నారు,ఇక్కడి ప్రాంతాల్లో డ్రగ్స్ అమ్మకాలు పార్టీలు జరిగితే ఎలాంటి భయం లేకుండా పోలీసులకు సమాచారం అందించాలన్నారు, పిల్లల భవిష్యత్తుపై ఇప్పటినుండే దృష్టి సారించాలని సూచించారు, హెల్మెట్ లేకుండా బైక్ ఎక్కడం అంటే మీ కుటుంబాన్ని అనాధ చేయడానికి సిద్ధపడటమే, ఈరోజు నుండి మీరే మార్పుగా మారండి మిమ్మల్ని చూసి పది మంది మారుతారు, మోటార్ సైకిల్ నడిపే వ్యక్తి విధిగా హెల్మెట్ తప్పనిసరి గా పెట్టుకోవాలన్నారు, మద్యం త్రాగి డ్రైవ్ చేయవద్దని ఆ సమయంలో హెల్మెట్ పెట్టుకున్న ప్రాణం నిలబడదన్నారు, చాలా రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలై ఎక్కువ మరణాల లకు కారణమవుతున్నాయన్నారు, సినిమాలు చూస్తూ యువత చెడు మార్గం వైపు ఆకర్షితులు కావద్దని చదువుతోనే భవిష్యత్తు బంగారు మయం అవుతుందని ఆయన యువతకు సూచించారు ఈ కార్యక్రమంలో కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ధాన్యం తూకం వేయాలంటూ రోడ్డెక్కిన మూడు గ్రామాల రైతులు



కథలాపూర్ ప్రభాతవార్త,

కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తూకం వేయడం ఆలస్యం అవుతుండడంతో విసిగిపోయిన మూడు గ్రామాల రైతులు సోమవారం కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు, మండలంలోని కలిగొట, గంభీర్పూర్, తండ్రియాలా, గ్రామాల రైతులు రోడ్డుపై బైఠాయించి తమ గోడు వెళ్ళబోసుకున్నారు, గత కొద్ది రోజులుగా పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కి తీసుకువచ్చి నా తూకం వేయడం లేదని, రైతులు అన్నారు, వర్షాలు సమీపించడంతో ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటి పాలవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు, ధర్నా జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లిన తెలంగాణ మాజీ మార్క్ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు, కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శంకర్, తాసిల్దార్ రమేష్, ఎస్సై రవికిరణ్ ఆర్ ఐ రవీందర్లు,రైతులకు నచ్చజెప్పడంతో ధర్నాలు విరమింప చేశారు.

# కొనుగోలు చేసి తరలించిన ధాన్యం సిఎంఆర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 18, ప్రభాతవార్త



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో రైస్ మిల్లర్లు ధాన్యం సి.ఎం.ఆర్. ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాములు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో గత ఖరీఫ్ లక్ష్యాలు పూర్తి చేసిన రైస్ మిల్లర్లు ఈసారి కేటాయించిన ధాన్యం లక్ష్యాల సాధన ప్రారంభించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి లారీల ద్వారా తరలించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరగా దిగుమతి చేసుకోవాలని, రోజుకు 10 నుండి 15 లారీలు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందు కొరకు అవసరమైన హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని, ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా పర్యవేక్షి ంచాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాశి అయోధ్య క్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసి బస్సు

డి ఏం శ్రావణ్ కుమార్



**మంథని ప్రభాతవార్త:** మంథని డిపో నుండి కాశి, అయోధ్య లాంటి పుణ్యక్షేత్రాలు ప్రత్యేక బస్సును టూర్ ప్యాకేజీ ద్వారా నడిపించ బడుతుందని డీఎం శ్రావణ్ కుమార్ తెలిపారు. మంథని నుండి సూపర్ లగ్జరీ బస్సు మే 24 వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి 30వ తేదిన తిరిగి మంథని కి చేరుకుంటుందని తెలిపారు. ఈ యాత్రలో భాగంగా వారణాసి, అయోధ్య, ప్రయోగరాజ్, మైహర్, రాంటెక్, చందా మహాకాళి, క్షేత్రాలను దర్శించుకోవచ్చు అని తెలిపారు. ఇట్టి బస్సులో పెద్దలకు రూ.7వేలు పిల్లలకురూ.5,500 రూపాయలు చార్జీ ఉంటుందని తెలిపారు. మంథని పరిసర ప్రాంత ప్రజలు ఇట్టి అవకాశాన్ని వినియోగించు కోగలరని కోరారు. సీట్ బుక్ చేసుకోవడానికి 9948671514, 99592 25923 నెంబర్లకు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

-మంథని సీఐ రాజు గౌడ్



-ముత్తారంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

**ముత్తారం, ప్రభాతవార్త:** సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతను కాపాడటం కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలను నిర్వహిస్తున్నట్లు మంథని సీఐ రాజు గౌడ్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం ముత్తారం మండల కేంద్రంలోని కసర్లగడ్డ సెంటర్‌లో ముత్తారం, మంథని, రామగిరి మండలాల పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి భారీ ఎత్తున కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా మంథని సిఐ రాజు గౌడ్ మాట్లాడుతూ.. వాహనదారులు ప్రయాణ సమయాల్లో ఖచ్చితంగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 75 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక గూడ్స్ ట్రాలీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు చలాన్లు విధించినట్లు ఆయన తెలిపారు.అనంతరం గ్రామస్తులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే గంజాయి వంటి మత్తుపదార్థాల వల్ల యువత జీవితాలు ఎలా నాశనమవుతున్నాయో వివరిస్తూ, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరిగే నేరాల నియంత్రణ, ఇతర ప్రజా భద్రతా అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం ఎస్ఐ రవికుమార్, ఎస్ఐలు దేగా రమేష్, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్,మే 18, ప్రభాతవార్త** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన పర్వీన్ సుల్తానా, ఫర్జానా నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కమ్మరి రాజేశ్వరి నిరుపేద అయిన తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన ముజ్జిగ స్వప్న కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో ఎస్ సి నేతకాని గూడెంలో మంజూరు అయిన బోర్ వెల్ ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం వినాయక నగర్ కాలనీవాసులు తమ కాలనీలో ఇండ్ల మధ్యలో నిర్వహిస్తున్న బీడీ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన ముత్తినేని రాజమణి తన పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 64 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, మే 18, ప్రభాతవార్త:** ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఐ. బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా క్రీడాధికార సంస్థ మైదానం వరకు చేపట్టిన తెలంగాణ మారథాన్ ఫిజికల్ లీటరసి కార్యక్రమంలో డిసిపి భాస్కర్,గుడిపేట 13వ పటాలము కమాండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, ఎ.సి.పి. ప్రకాష్, యువతీ యువకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశం యువ భారతదేశం అని, దేశంలో యువ జనాభా అధికంగా ఉందని తెలిపారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిలో యువత అత్యంత కీలకమని, దేశ అభివృద్ధి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. ఆరోగ్యం, క్రమశిక్షణ కలిగి ఉండాలని, వ్యాయామం, యోగ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాలు, మద్యం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని యువత వాటికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత తెలంగాణాగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. "నో టు డ్రగ్స్ ఎస్ టు ఎక్సర్సైజ్" నినాదం దిశగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం వైపు అడుగులు వేయాలని, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఆందోళన నుంచి బయటపడవచ్చు అని, అనారోగ్యం దరిచేరకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# బీరు సీసాతో దాడి

నిందితుడికి నాలుగేళ్ల జైలు

ఖని కోర్టు తీర్పురూ.11 వేల జరిమానా విధింపు

వైన్ షాప్ గొడవతో ఘర్షణ

11 మంది సాక్షులతో నేరం రుజువు

**గోదావరిఖని, ప్రభాతవార్త:**

వైన్ షాప్‌లో గలాటాను అడ్డుకున్న ఇద్దరిపై పగిలిన బీరు సీసాతో దాడి చేసిన కేసులో నిందితుడికి ఖని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవన్ సూరజ్ సింగ్ నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. అదనంగా రూ.11 వేల జరిమానా చెల్లించాలని సోమవారం తీర్పునిచ్చారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2022 నవంబర్ 29న 8 ఇంక్లైన్ కాలనీలోని ఓ వైన్ షాప్‌లో పట్టమరపు దావిదు, కొల్లి రాజు మద్యం సేవిస్తూ గలాటా సృష్టించారు. మద్యం సీసాలు విసురుతూ హంగామా చేయడంతో అక్కడే ఉన్న పులిరాజు వారించాడు. దీంతో ఆగ్రహానికి గురైన దావిదు బయటకు వచ్చి పగిలిన బీరు సీసాతో పులిరాజు ఎడమ మెడ భాగంలో మూడుసార్లు పొడిచాడు.దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పారుపల్లి శ్రీనివాస్‌పైనా అదే సీసాతో దాడి చేసి పెదవిపై గాయపరిచాడు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అప్పటి రెండో టౌన్ సీఐ అప్జలుద్దీన్ కేసు నమోదు చేశారు.ప్రస్తుత రెండో టౌన్ సీఐ ప్రసాదరావు పర్యవేక్షణలో కోర్టు డ్యూటీ అధికారి ఎలిగేటి మల్లేశం 11 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలికల పద్మజ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాల ఆధారంగా నిందితుడిపై నేరం రుజువుకావడంతో కోర్టు శిక్ష విధించింది.నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రాసిక్యూషన్ బృందాన్ని ఖని ఏసీపీ మడత రమేష్, సీపీ ఎంబర్ కిషోర్ ఝా అభినందించారు.

# దొంగల బీభత్సం..!

సుద్దాలలో ఎల్లమ్మ ఆలయంలో చోరీ

హుండీ పగులగొట్టి నగదు అపహరణ

పుస్తెమట్టెలు ఎత్తుకెళ్లిన దొంగలు

కారు అద్దాలు ధ్వంసం

**కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:**



సుద్దాలలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఎల్లమ్మ ఆలయంలో చొరబడి ఉండి పగలగొట్టి నగదుతోపాటు అమ్మవారి పుస్తె మట్టెలు సైతం అపహరించారు. అంతేకాకుండా అక్కడే ఉన్న కారు అద్దాలను ధ్వంసం చేసి సౌండ్ సిస్టం ఎత్తుకెళ్లారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీని పగులగొట్టి, అందులో ఉన్న నగదు, అమ్మవారి మెడలోని పుస్తె మట్టెలను ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా ఆలయం బోరు మోటర్ సైతం ఎత్తుకెళ్లిన దొంగలు, ఆలయ ప్రాంగణంలో ఉన్న కారు అద్దాలను సైతం ధ్వంసం చేసి సౌండ్ సిస్టం ఎత్తుకెళ్లారు. ఆలయంలో ఈ చోరీ మూడోసారి జరగడం విశేషం. గతంలో చోరీ జరిగినప్పటికీ ఇప్పటివరకు దొంగలను పోలీసులు పట్టుకోకపోవడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఆలయంలో దొంగతనం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని, గుర్తుతెలియని వ్యక్తులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని గౌడ కులస్తులు డిమాండ్ చేశారు.

# కిషోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు

## ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ లింబాద్రి

**మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:** మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాం కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల కిషోర బాలికల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషోర బాలికల ఆరోగ్య పరిరక్షణకు





ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రక్తహీనత, డయాబెటిస్ పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేయడంతో పాటు హెచ్ పి వి వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బాలికలు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, వార్డు కౌన్సిలర్ పందిరి రమేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ అంజిత్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# సంఘటన్ సృజన్ అభియాన్ నాయకులను సన్మానించిన కొమిరెడ్డి లింగారెడ్డి

**మెట్పల్లి అర్బన్, ప్రభాతవార్త :**



సంఘటన్ సృజన్ అభియాన్ నిజామాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ గాలి అనిల్ కుమార్, జగిత్యాల నియోజకవర్గం కోఆర్డినేటర్ బోడు రాకేష్, సోమవారం కోరుట్ల నియోజకవర్గ పర్యటనల్లో భాగంగా టీ పిసిసి కోఆర్డినేటర్ ఎండి అవేజ్ విజ్ఞప్తి మేరకు మెట్పల్లి పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించి స్థానిక నేతలతో కలసి కాంగ్రెస్ అభివృద్ధి సంక్షేమ పథకాలపై చర్చించారు.సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్, హైకోర్టు న్యాయవాది కోమిరెడ్డి లింగారెడ్డి మాజీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం ఆధ్వర్యంలో ఇరువురికి శాలువాతో ఘనంగా సన్మానించినారు. అనంతరం వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడానికి సిద్ధంగా ఉంది నిధుల విషయంలో ఎలాంటి కొరత లేదని అభివృద్ధి విషయంలో అనుమానాలకు తావు లేకుండా అభివృద్ధిపై దృష్టి సావించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యామని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మేడిపల్లి గ్రామ పంచాయతీ సభ్యులు బద్దం రాజారెడ్డి, న్యాయ విద్యార్థి ఏశాల రాజాశేఖర్,రైతు నాయకులు బద్దం చిన్నారెడ్డి , పాకాల మహేష్ కుమార్ గౌడ్,చింతలపేట మాజీ విడిసి అధ్యక్షులు ముక్కెర మల్లేష్ యాదవ్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు మహమ్మద్ సుమీర్ పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

### పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్

### ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 81



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవ హరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 81 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తెలంగాణ టూరిజం వారి టూరిస్ట్ గైడ్ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పలు ఫిర్యాదులను పరిశీలించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై న్యాయపరంగా, పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలోకి వచ్చే సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, విచారణలో ఎటువంటి లోపం ఉండకూడదని సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులను స్వీకరించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించడం జరుగుతోందన్నారు.



# మెట్‌పల్లి వార్త

# ఎంపీ ధర్మపురి అరవింద్‌ను కలిసిన బీజేపీ నేతలు

**మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:**



జగిత్యాల జిల్లా పర్యటనకు వచ్చిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ కు మెట్పల్లి శివారులోని వెంకట్రావుపేట వద్ద బీజేపీ నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం జగిత్యాల జిల్లా కార్యాలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికేల నవీన్ ఆధ్వర్యంలో బిజెపి కౌన్సిలర్లు నాయకులు ఎంపీని కలిసి పలు అంశాలపై చర్చించారు. ఇటీవల బీజేపీ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ధోనికేల నవీన్‌ను పోలీసులు ఈడ్చుకెళ్లిన ఘటనపై ఎంపీ ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రజా సమస్యలపై నవీన్ చేస్తున్న పోరాట స్ఫూర్తిని అభినందిస్తూ ఆయన ధైర్యసాహసాలను మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు,ఏలేటి నరేందర్ రెడ్డి, ధర్మపురి వేణుగోపాల్, బొడ్ల ఆనంద్, కోయల్ కార్ లింగేశ్వర్, తిరుసుల్ల అర్జున్,మహేశ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనుల కోసం ఎంపీ అరవింద్ కు వినతి

**మల్లాపూర్,ప్రభాతవార్త :**



మండలంలోని రేగుంట గ్రామంలో పల్లె దవాఖాన భవనం శిథిలావస్థకు చేరడంతో అట్టి భవనాన్ని కూల్చి కొత్త భవనాన్ని నిర్మించవలసిందిగా నిజామాబాద్ ఎంపీ అరవింద్ కు సోమవారం రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ వినతిపత్రం అందచేశారు. అలాగే అంగన్‌వాడీ భవనాలు గ్రామంలో ఉన్న తదితర సమస్యలను కూడా ఎంపీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మల్లాపూర్ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, మల్లాపూర్ పట్టణ అధ్యక్షుడు లవంగ శివ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, బిజెపి ఐ.టి సెల్ కన్వీనర్ బండారి వెంకటేష్ వార్డు సభ్యులు బాస రాజారెడ్డి, కుందేళ్ల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# ములుగు పర్యాటకానికి రీల్స్ పోటీలు

## విజేతలకు నగదు బహుమతులు.

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త,** ములుగు జిల్లా పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటేలా ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. మే 21న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.మే 21 నుంచి 30 వరకు ములుగు పర్యాటకం, సంస్కృతిపై 4కే వీడియో రీల్స్ రూపొందించి సమర్పించవచ్చన్నారు. ఉత్తమ రీల్స్‌కు మొదటి బహుమతి ..21 వేలు, రెండో బహుమతి ..15 వేలు, మూడో బహుమతి..10 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

# సిరిసిల్ల వార్త

## ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం, వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంపు, అన్ లోడింగ్ చేయడం, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, మెప్మా అధికారులతో కలిసి ప్రతి రోజు ఉదయం 08.00 గంటలకు జిల్లా కలెక్టర్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని సూచించారు. రైస్ మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. హమాలీలకు భోజనం, వైద్య సేవలు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని, క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు

## ఆరోగ్యం.. ఫిట్నెస్ పై అవగాహన కల్పించేందుకు 2కే రన్




సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త

: విద్యార్థులు, యువతలో ఆరోగ్యం ఫిట్నెస్ పై అవగాహన కల్పించేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల్లో 2కే రన్ నిర్వహించామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. జెండా ఊపి 2 కే రన్ ప్రారంభించి , అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక.. కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్.. అలైవ్ లో భాగంగా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించామని డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ఈ నెల 19 వ తేదీన జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కెరీర్ , నైపుణ్యాభివృద్ధి నిర్వహించి, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకత్వంపై యువతకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన సిరిసిల్లలోని మినీ స్టేడియంలో క్రీడా దినోత్సవంలో భాగంగా కబడ్డీ, వాలీబాల్, కరాటే, షటిల్ బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22వ జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభ నిర్వహించనున్నట్లు తెలిపారు . వేములవాడ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, హరిత హోటల్ సమీపంలోని పరిసరాలలో స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం సిరిసిల్ల కొత్త చెరువు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని కె కన్వెన్షన్ హాల్లో ఉద్యోగ సాధన పేరుతో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, డీవైఎస్ఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో పొలిటికల్ వార్ . బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ తీవ్ర ఉద్రిక్త!

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నేతన్న చౌరస్తా వేదికగా బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు ఎదురెదురుగా మోహరించి ఆందోళనలకు దిగడంతో భారీ ఉద్రిక్తత నెలకొంది. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు పోటీగా ఖిడౌన్ డౌన్ఖి అంటూ నినాదాలు చేయడంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. కాసేపట్లోనే ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకోవడం, ఒకరిపై ఒకరు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి చేతులు దాటేలా కనిపించింది. గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 29 మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఘటనకు అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు నేతన్న చౌరస్తా వద్ద నిరసనకు దిగాయి. సరిగ్గా అదే సమయంలో, బండి భగీరథ అరెస్టు వ్యవహారాన్ని నిరసిస్తూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర క్యాబినెట్ నుంచి తక్షణమే తొలగించాలంటూ బీఆర్ఎస్ శ్రేణులు కూడా పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నాయి. ఇరు పార్టీలు ఒకేచోట పోటాపోటీగా నిరసనలకు దిగడంతో ఉద్రిక్తత పతాక స్థాయికి చేరింది. ఒకరు ఒకరిని తోసుకోవడంతోపాటు చెప్పులు విసిరేసుకున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై భారీగా బలగాలను మోహరించారు. జిల్లా ఎస్పీ మహేష్ గీతే స్వయంగా రంగంలోకి దిగి ఉద్రిక్తతను అదుపు చేసే ప్రయత్నం చేశారు. బీజేపీ. బిఆర్ ఎస్ ల నాయకులు, కార్యాకర్తలపై స్వల్ప లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు. ఇరు పార్టీల ముఖ్య నేతలతోజిల్లా ఎస్పీ మాట్లాడి, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, శాంతియుతంగా విరమించాలని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఇరుపక్షాల కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో, శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు విధిలేని పరిస్థితుల్లో స్వల్ప లాఠీఛార్జ్ చేశారు. అనంతరం ఇరు పార్టీల నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, పట్టణ అధ్యక్షుడు దోమల శ్రీకాంత్, తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు



## ఈ నెల 20న మందుల షాపుల బంద్ కు పిలుపు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



ఈ నెల 20న మండలములో చేపట్టే మెడికల్ షాపుల బందుకు మద్దతుగా నిలవాలని షాపుల యజమానులు కోరారు. బంద్ కోరుతూ స్థానిక తహసీల్దార్ సురేష్ కు, రక్షక భట కార్యాలయములో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు షాపుల యజమానులు మాట్లాడుతూ ఆన్లైన్ మందుల సరఫరా వల్ల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్న చిన్న షాపుల యజమానుల భవితవ్యం అగమ్య గోచరంగా మారుతుందని వాపోయారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆన్లైన్ మందుల వల్ల మోసపోయే అవకాశం ఉంటుందన్నారు. కావున 20న జరిగే బందుకు మండల ప్రజలు సహకరించాలని యజమానులు కోరారు.

## ఔషధ దుకాణాల బంద్ విజయవంతం చేయాలి

గంభీరావుపేట, ప్రభాతవార్త



:ఏఐఓసిడి ఆధ్వర్యంలో బుధవారం దేశవ్యాప్తంగా తలపెట్టిన ఔషధ దుకాణాల బంద్ ను విజయవంతం చేయాలని మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చింత వెంకటేశం, ప్రధాన కార్యదర్శి ఈరవేణి సంజీవ్ పిలుపునిచ్చారు. సోమవారము గంభీరావుపేట మండల కేంద్రంలో మండల మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆన్లైన్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్న ఔషధాల ను నియంత్రించి చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. బంద్ కు సహకరించవలసిందిగా తహసిల్దార్, ఎస్సై లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్లైన్ మందుల విక్రయాల ద్వారా ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు, ఆంటీబయాటిక్, నార్కోటిక్ తదితర మందులు నేరుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ ఔషధ దుకాణదారులు అధిక డిస్కౌంట్లతో ఆన్లైన్ వ్యాపారం చేయడం మూలంగా చిన్న తరహా మెడికల్ షాప్ లకు ఇబ్బందిగా మారిందన్నారు. ఔషధ దుకాణాల పై ఆధారపడి జీవనాధారం కొనసాగిస్తున్న వ్యాపారస్తులు ఆన్లైన్ వ్యాపారం ద్వారా రోడ్డున పడే అవకాశాలు ఉన్నట్లు ఆవేద వ్యక్తం చేశారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రెండు జీవోలు అదేవిధంగా కొనసాగిస్తున్నారని, వాటిని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవోల రద్దు కొనసాగే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ బందుకు సహకరించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఔషధ దుకాణాలు బంద్ పాటిస్తున్న నేపథ్యంలో నిత్యం బీపీ, షుగర్ తదితర మందులు వాడే ప్రజలు ముందస్తుగా మందులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల మెడికల్ అసోసియేషన్ చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు

# ఈఏపీసెట్ ఫలితాల్లో 'జగిత్యాల అల్ఫోర్స్' అఖండ విజయం

### 22వ ర్యాంకుతో మెరిసిన పి.చరణ్
### టాప్ ర్యాంకుల్లో లాస్యరెడ్డి, లహరిక, మహానాజ్..
### విద్యార్థులను అభినందించిన అల్ఫోర్స్ చైర్మన్ డా.వి. నరేందర్ రెడ్డి

**జగిత్యాల అర్బన్ ప్రభాతవార్త:**

పట్టణంలో జగిత్యాల "అల్ఫోర్స్" విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఇటీవల విడుదలైన ఈఏపీసెట్ (ఈఏపీసెట్2026) ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో జిల్లా చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థి పి.చరణ్ ఇంజనీరింగ్ విభాగంలో స్టేట్ లెవెల్లో 22వ ర్యాంకు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. వీరితో పాటు లాస్యరెడ్డి (ఇంజనీరింగ్) 614వ ర్యాంకు రాజరపు లహరిక (ఇంజనీరింగ్) 2792వ ర్యాంకు మరియు మహానాజ్ ఫార్మసీ విభాగంలో 8460వ ర్యాంకు సాధించి విద్యాసంస్థల కీర్తి పతాకాన్ని ఎగురవేశారు. కాగా, ఈ ఫలితాల్లో ఏకంగా నలుగురు విద్యార్థులు 1,000 లోపు ర్యాంకులు సాధించడం విశేషం. జగిత్యాల అల్ఫోర్స్ సాధించిన ఈ అఖండ విజయంపై అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కఠోర శ్రమ, క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యాబోధన వల్లే విద్యార్థులు ఈ స్థాయి ర్యాంకులు సాధించగలిగారని కొనియాడారు. స్టేట్ ర్యాంకులతో జగిత్యాల పేరును మారుమోగించిన విద్యార్థులను, వారికి నిరంతరం అండగా నిలిచిన తల్లిదండ్రులను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. అలాగే విద్యార్థులను తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమించిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.




# ముప్పాల చెరువుపై కబ్జాకోరలు

### -రఘురాములకోటలో జీవన్‌రెడ్డి ధర్నా

**జగిత్యాల, రూరల్ ప్రభాతవార్త:**



జగిత్యాల మండలం రూరల్ రఘురాములకోట శివారులోని ముప్పాల చెరువు ఒర్రెలు కబ్జాకు గురవుతుండడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో జడ్పి మాజీ తొలి చైర్పర్సన్ దావ వసంతతో కలిసి జీవన్ రెడ్డి పాల్గొని, ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. చెరువులు, కుంటలను సంరక్షిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తొలినాళ్లలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 'మిషన్ కాకతీయ' పథకం ద్వారా చెరువుల్లో పూడిక తీయించి, వాటికి పునరుజ్జీవం పోశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ నేడు జగిత్యాల పట్టణ పరిసరాల్లోని ముప్పాల చెరువు, మోతె చెరువు, కండ్లపల్లి, చింతకుంట చెరువులు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారులు మట్టితో ఒర్రెలను, వాగులను పూడ్చివేస్తూ భూములను ఆక్రమిస్తున్నా అధికారులు మౌనంగా ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ముప్పాల చెరువులో సుమారు 100 ఎకరాల మేర కబ్జాకు గురైందని, దీనివల్ల ఒర్రెలు మాయమైపోయాయని జీవన్ రెడ్డి ఆరోపించారు. నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఏం చేస్తున్నారని ఆయన నిలదీశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2014 నాటి గూగుల్ మ్యాప్స్ ఆధారంగా చెరువులను పూర్వ స్థితికి తీసుకురావాలని, ఆక్రమణదారులు పోసిన మట్టిని తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చెరువులకు పక్కాగా హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. మరోవైపు తిమ్మాపూర్ సమీపంలోని పాలిష్ యూనిట్ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి వల్ల పంటలు దెబ్బతినడంతో పాటు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనుమతులు లేని ఆ యూనిట్‌ను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తీవ్రతను గమనించిన అధికారులు రంగంలోకి దిగి, మట్టితో పూడ్చిన కాలువలను వారం రోజుల్లోగా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీతో రైతులు తమ నిరసనను

# మేరు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాపర్తి వినోద్

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త.**



జగిత్యాల పట్టణంలో మేరు సమాజ అభివృద్ధి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు అత్యంత ఉత్కంఠభరితంగా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఈ ఎన్నికల్లో మార్పును, పారదర్శకతను కాంక్షిస్తూ కులబాంధవులు నూతన నాయకత్వానికి భారీ మెజారిటీతో తిరుగులేని విజయాన్ని అందించారు. మొత్తం 827 ఓట్లు పోల్ అవ్వగా, సభ్యులు భారీ ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమాజ అభివృద్ధి, కుల వృత్తి కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించేలా అత్యంత సమర్థవంతమైన నూతన కార్యవర్గం ఈ ఎన్నికల ద్వారా కొలువుదీరింది. ఎన్నికల ఫలితాల వివరాల్లోకి వెళ్తే అధ్యక్షుడిగా రాపర్తి వినోద్ 439 ఓట్లు సాధించి, తన సమీప అభ్యర్థిపై 181 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా రాగిల్ల నారాయణ 433 ఓట్లు పొంది, 114 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన పోటీలో గట్ల శ్రీను 437 ఓట్లు సాధించి, 242 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం అందుకున్నారు. కాగా, సహాయ కార్యదర్శి పదవికి రాగిల్ల శ్రీధర్ కుల సభ్యుల పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారి పదవికి జరిగిన పోరులో గట్ల శ్రీకర్ 487 ఓట్లు సాధించి, ఈ ఎన్నికల్లోనే అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థిగా నిలిచారు. ఆయన తన సమీప అభ్యర్థిపై 199 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఇంతటి భారీ విజయాన్ని అందించిన ప్రతి ఒక్క మేరు సమాజ సభ్యునికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కుల బాంధవుల కష్టసుఖాల్లో తోడుంటూ, సంఘం బలోపేతానికి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలి

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ అన్నారు .మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మెన్‌గా నియామకం పొందిన బొమ్మ శ్రీరామ చక్రవర్తిని కరీంనగర్‌లోని ఇందిరా భవన్‌లో మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొన్న చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మెన్‌గా బొమ్మ శ్రీరామ చక్రవర్తి నియామకం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కూతురు రాజేష్, పిట్ట ధర్మరాజు, చీటీ లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్లు కుసరి అనీల్, లైశెట్టి వెంకటి మరియు జగిత్యాల మున్నూరు కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# జగిత్యాల వార్త

# గన్ని సంచుల కొరత లేదు

### -కొనుగోళ్లలో జాప్యం లేదు
### -రైతులకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హామీ

**జగిత్యాల, రూరల్ ప్రభాతవార్త:**



ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని, రైతు సంక్షేమానికి తాము పూర్తి స్థాయిలో కట్టుబడి ఉన్నామని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల మండలం రూరల్ లక్ష్మీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రోజున ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను, రైతులకు కల్పిస్తున్న వసతి సదుపాయాలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లపై వస్తున్న అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని కోరారు. గతంలో కంటే అత్యధికంగా ఈసారి ధాన్యం సేకరిస్తున్నామని, ఒక్క జగిత్యాల నియోజకవర్గంలోనే ఇప్పటివరకు ఒక లక్ష క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేశామని వెల్లడించారు. రైతుల అవసరాలను గుర్తించి, కోరిన వెంటనే కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయడమే కాకుండా, గన్ని సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. తమ ఇబ్బందులను గుర్తించి సత్వరమే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు లక్ష్మీపూర్ గ్రామ రైతులు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, ఏఎంసీ ఛైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ సత్తిరెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు తిరుపతి రెడ్డి, చెరుకు జాన్, గర్వందుల గంగన్న, మాజీ ఆత్మ ఛైర్మన్ ఏలేటి రాజిరెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పురిపాటి రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బాపు రెడ్డి, ఏనుగు గంగారెడ్డి, గడ్డం గోపాల్ రెడ్డి ఇతర రైతు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**బీర్ పూర్ ప్రభాత వార్త.** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం కొల్వాయి గ్రామంలో జడ్పీహెచ్ ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ బడి ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ శివారులో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలను సోమవారం ఉపాధ్యాయులు స్వయంగా కలిసి, తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని అవగాహన కల్పించారు. పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే కేరాఫ్ అడ్రస్ అని, ప్రైవేటు స్కూళ్లకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని కొల్వాయి జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయ బృందం కోరింది. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు ఉదయం పూట ఉచితంగా అల్పాహారం (బ్రేక్ ఫాస్ట్)అందించుటకు ప్రభుత్వం నిర్ణయించిందనీ తెలిపారు. ఇంతకు ముందు లాగే ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులు (యూనిఫాం) మరియు నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నట్టు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కార్పొరేట్ పాఠశాల ఫలితాలను ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది 10వ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించమని అందులో 19 మంది విద్యార్థులు 500 కి పైగా మార్కులు సాధించాగా 5 గురు విద్యార్థులు 550 కి పైగా మార్కులతో ప్రతిభ చాటారనీ తెలియజేశారు. "మీ డబ్బులను ఆదా చేసుకోండి.. ప్రభుత్వ పాఠశాలలను బతికించండి" అని ఉపాధ్యాయులు చేసిన విజ్ఞప్తికి ఉపాధి హామీ కూలీలు, తల్లిదండ్రుల నుండి విశేష సానుకూల స్పందన లభించింది. తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సత్యరాజు, సి ఆర్ పి శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి..

### మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్..

### మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బిఆర్ఎస్ ధర్నా

మానకొండూర్,(ప్రభాతవార్త:

కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయక శాఖ మంత్రి బండి సంజయ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. సోమవారం మానకొండూరు మండల కేంద్రంలో ని కరీంనగర్ వరంగల్



ప్రధాన జాతీయ రహదారిపై బి ఆర్ఎస్ పార్టీ మండల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి, బండి సంజయ్ తక్షణమే రాజీనామా చేయాలంటూ , రోడ్డుపై బఠాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు నినాదాలు చేపట్టారు. మైనర్ బాలిక కేసులో బండి సంజయ్ కుమారుడు భగీరథ ను ప్రభుత్వం కఠినంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన తన కొడుకును బండి సంజయ్ చట్టపరంగా శిక్షి ంచే విధంగా పోలీసులకు అప్పగించాలి తప్ప, తన కొడుకును కాపాడే విధంగా పోలీసులకు దొరకకుండా ఆశ్రయిస్తున్న బండి సంజయ్ పై ఏ టు కేసు నమోదు చేయాలని ఆరోపించారు. బండి సంజయ్ కొడుకు చేసిన తప్పుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనంగా ఉండడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, శాతరాజు యాదగిరి, గుర్రం కిరణ్, నియోజకవర్గం స్థాయి నాయకులు పాల్గొన్నారు

# గవర్నర్‌కు 'సరస్వతీ నది అంత్య పుష్కరాల' ఆహ్వాన పత్రిక అందజేత

### -గవర్నర్ శివప్రతాప్ శుక్లను కలిసిన దేవాదాయ శాఖ అధికారులు

మహదేవపూర్, మే 18, ప్రభాతవార్త

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం వేదికగా మే 21 నుండి ప్రారంభం కానున్న పవిత్ర సరస్వతీ నది అంత్య పుష్కరాల మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లకి అధికారిక ఆహ్వానం అందింది. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల బృందం గవర్నర్‌ని మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా పుష్కరాల విశిష్టతను వివరించి, అధికారిక ఆహ్వాన పత్రికను వారికి అందజేశారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయశాఖ సలహాదారు గోవింద హరి, మరియు దేవాదాయ శాఖ కమీషనర్ ఎం. హనుమంతరావు సంయుక్తంగా గవర్నర్‌కి అంత్య పుష్కరాల ఆహ్వాన పత్రికను సమర్పించారు. ఈ సందర్భంగా కాళేశ్వర–ముక్తీశ్వర స్వామి దేవాలయ వేదపారాయణదార్ వైకుంఠ పండా మరియు ఇతర ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణలతో, మంగళ వాయిద్యాల నడుమ గవర్నర్‌కి ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను బహూకరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పవిత్ర త్రివేణీ సంగమ క్షేత్రమైన కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1 వరకు ఈ సరస్వతీ నది అంత్య పుష్కరాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలకు దేశం నలుమూలల నుండి దాదాపు 30 నుండి 40 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని మంత్రి కొండా సురేఖ ఈ సందర్భంగా గవర్నర్‌కు వివరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ఘాట్ల నిర్మాణం, తాగునీరు, రవాణా, పారిశుధ్యం తదితర అన్ని ఏర్పాట్లను కట్టుదిట్టంగా పూర్తి చేసిందని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఆర్.జె.సి రామకృష్ణా రావు, ఆలయ ఈఓ మహేష్, ఇతర అర్చక సిబ్బంది మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# బాలయ్య పల్లిలో ఉచిత వైద్య శిబిరం...

తిమ్మాపూర్, ప్రభాత వార్త :

కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం, బాలపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో



సుమారు 150 మందికి పైగా రోగులకు నిపుణులైన వైద్యులు సేవలందించారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో వంటి కీలక పరీక్షలు నిర్వహించి తక్షణ నిర్ధారణ చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే రోగులను కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తరలి ంచి ఆధునిక వైద్యం అందిస్తామని తెలిపారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందిం చిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిభిర ంలో మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, అబ్దుల్ వకీల్, రఘు, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ శ్రేణులు నిరసన

కరీంనగర్ టౌన్,(ప్రభాతవార్త:

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేసినట్లు ఒక ప్రకటనలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీ.వి. రామకృష్ణ రావు పేర్కొన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ లో భారీ ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ బండి సంజయ్ ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ, బండికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మైనర్ బాలికకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బి.అర్.ఎస్ నేతలు ఫ్లెక్సీ దగ్ధం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.పోలీసులు బి.అర్.ఎస్ నేతల చేతుల్లోంచి ఫ్లెక్సీని బలవంతంగా లాక్కున్నారు. పోలీసులకు, నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. బండి సంజయ్ మంత్రిగా ఉంటే మైనర్ బాలికకు న్యాయం జరగదని ఆయన రాజీనామా చేయాలని కోరారు. ప్రధాని మోదీ,బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# కరీంనగర్ వార్త

# ప్రజావాణికి 269 దరఖాస్తులు

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.



సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 187 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో 56 దరఖాస్తులు, హుజురాబాద్ రెవిన్యూ డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో 26 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా జిల్లాలో 269 దరఖాస్తులు సమర్పించారు.

# ప్రభుత్వం దృష్టికి ఆశా వర్కర్ల సమస్యలు ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ప్రభాత వార్త :

ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.సోమవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో ఆశా వర్కర్లు అందించిన వినతిపత్రాన్ని ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడమే కాకుండా న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు తనవంతు తోడ్పాటునందిస్తానన్నారు. ఇదిలా ఉండగా, ఆశా వర్కర్ల వేతనాలకు 18వేల రూపాయలకు స్థిరీకరిస్తూ ప్రతినెలా ఒకటవ తేదీన చెల్లించాలని ఆ వినతిపత్రంలో ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నామని, ఇప్పటి వరకు వేతన స్థిరీకరణ చేయని కారణంగా అన్యాయానికి గురవుతున్నామని, 18వేలకు వేతనాలు పెంచాలని, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు నేతనాలు పెంచడమే కాకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశావర్కర్లు కోరారు. అంతేకాకుండా 50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు చెల్లించాలని, ఆదివారం సెలవుదినంగా ప్రకటించాలని, పండుగలకు సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆశాలకు ప్రత్యేకంగా రెస్టు రూములు ఏర్పాటు చేయాలని, ఆశాలకు పనిభారం తగ్గించాలని, పారితోషికం లేని పనులు చేయించకూడదని, ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పూనమ్ క్లాత్తో కూడిన క్వాలిటీ యూనిఫాం ఇవ్వాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సారిక, తిమ్మాపూర్ మండల అధ్యక్షురాలు రజిత తోపాటు సుమారు 50 మంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# జోగిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, ప్రభాత వార్త :

ఇటీవల అనారోగ్యంతో మరణించిన తిమ్మాపూర్ మాజీ ఎంపీటీసీ ఎడ్ల జోగిరెడ్డి కుటుంబ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. సోమవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా జోగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మరణానికి దారితీసిన పరిస్థితుల గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జోగిరెడ్డి మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారికి సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి,మహాత్మానగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, పార్టీ నాయకులు పోలు రాము,రమేశ్, నగునూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం..

ధాన్యం,మొక్కజొన్న కొనుగోళ్లు ఎంతో పారదర్శకంగా సాగుతున్నాయి

రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు

ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణా రావు

**జూలపల్లి,ప్రభాతవార్త:**



జూలపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌ను సింగిల్ విండోలను సెంటర్ లను ఆకస్మికంగా సందర్శించి మక్కలు,వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులకు అందుతున్న సదుపాయాలను,ధాన్యం తూకాలను తహసీల్దార్ దత్తు ప్రసాద్,అధికారులతో కలిసి స్వయంగా ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ.. జూలపల్లి కొనుగోలు కేంద్రం నుండి ఇప్పటివరకు దాదాపు 24 లారీల ధాన్యం తరలి వెళ్ళిందని, తాను స్వయంగా ఆ ట్రాక్షీట్లను,కాంటాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు.ఏ ట్రాక్షీట్ లో కూడా 41.100 లేదా 41.200 కిలోల కంటే ఎక్కువ బరువు వేయలేదని,తూకాలు పారదర్శకంగా సాగుతున్నాయని స్పష్టం చేశారు.రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాల రచ్చ కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే కావాలని రచ్చ చేస్తూ, ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విజయరమణా రావు విమర్శించారు.గత ప్రభుత్వాల హయాంలో జూలపల్లి మండలంలో రైతులు పడ్డ ఇబ్బందులు ఇక్కడి రైతులకు బాగా తెలుసన్నారు.ఈసారి హార్వెస్టర్లు ఎక్కువగా నడవడం,వరి కోతలు ఒకేసారి పూర్తికావడంతో పాటు దిగుబడి కూడా భారీగా పెరగడం వల్ల ధాన్యమంతా ఒకేసారి మార్కెట్‌కు వచ్చి కొంత ఇబ్బందిగా మారిందని,దీనిని రైతులు గమనించాలని కోరారు.రైతులు కొంతవరకు ఏఈఓ ల వద్ద కాకుండా బయట నెంబర్లు వేయించుకోవడం,సరైన ఐడెంటిఫికేషన్ లేకుండా ధాన్యం తీసుకురావడం వల్లే సమస్యలు వస్తున్నాయన్నారు.మక్కల కొనుగోలు విషయంలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేవని మొక్కజొన్న కొనుగోళ్లు కూడా పారదర్శకంగా జరుగుతుందని అన్నారు.ఎలాంటి ఇబ్బంది ఉన్నా తాము,రైస్ మిల్లర్లు,నాయకత్వం కలిసి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదనే ఉద్దేశంతో యంత్రాంగం శ్రమిస్తోందని,ప్రభుత్వం ఖచ్చితంగా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే విజయరమణా రావు రైతులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జూలపల్లి మార్కెట్ చైర్మన్ కొమ్మ పోచాలు,దూళికట్ట సింగిల్ విండో చైర్మన్,పుల్లూరి వేణుగోపాల్ రావు,డైరెక్టర్లు,పలు గ్రామాల సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,లోక జలపతి రెడ్డి,బొజ్జ శ్రీనివాస్, దారబోయిన నర్సింగ్ యాదవ్,మెతుకు కాంతయ్య,కందుకూరి అంజయ్య,సిరికొండ కొమురయ్య,బండి స్వామి,కార్యకర్తలు,రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

కటింగ్‌లు లేకుండా వడ్లు,మక్కల కొనుగోళ్లు..

రేగడిమద్దికుంటలో కేంద్రాలను పరిశీలించిన ప్రభుత్వ విప్

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:**



రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పెద్దపల్లి నియోజకవర్గంలో ఎలాంటి కటింగ్‌లు లేకుండా పారదర్శకంగా వడ్లు, మక్కల కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో మార్క్‌ఫెడ్, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్లు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నట్లు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోళ్ల విషయంలో చిన్నచిన్న అంశాలను రాద్ధాంతం చేసి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. రైస్‌మిల్లర్లతో సమన్వయం చేస్తూ వడ్ల దిగుమతులు వేగవంతం చేస్తున్నామని, ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మక్కల కొనుగోళ్లు నిర్వహిస్తూ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. మక్కలకు మార్కెటింగ్ సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం నష్టాన్ని భరిస్తూ కొనుగోళ్లు కొనసాగిస్తోందని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరిగిందని, క్వింటాకు కటింగ్‌లు చేసిన ఘటనలు ఉన్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పారదర్శకంగా కొనుగోళ్లు జరుగుతున్నప్పటికీ కొందరు అనవసర విమర్శలు చేయడం తగదన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మండల కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## అర్చకుల సమస్యల పరిష్కారానికి ధర్మవాణి

**ఎన్టీపీసీ, ప్రభాతవార్త:**



దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఆధ్వర్యంలో అర్చకులు, దేవాదాయ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం"ధర్మవాణి" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 2007లో ధూప దీప నైవేద్యానికి ఎంపికైన అభ్యర్థులకు ఆర్డర్ కాపీలు ఇవ్వాలని అర్చకులు కోరారు.అలాగే కమిషనర్ కార్యాలయం ద్వారా జారీ చేసిన అర్చకుల గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షులు నిట్టూరు సతీష్ శర్మ ప్రారంభించారు. ప్రతి అర్చకుడు గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నాగరాజ్ సంపత్ కుమార్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఏటూరు శ్రావణ్ కుమార్ ఆచార్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాందూరి దామోదర్ చారి, రామగుండం మండల అధ్యక్షులు రుద్రపట్ల సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరునగరి హరి, కరీంనగర్ జిల్లా ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పు తగ్గిద్దాం... బీపీ నియంత్రిద్దాం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:**ఉప్పు తగ్గిద్దాం బీపీ నియంత్రిద్దాం అనే నినాదంతో ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ పాల్గొని మాట్లాడారు. రక్తపోటు అనేది మనుషుల్లో ముందే తెలియకుండా వచ్చే ఒక నిశ్శబ్ద వ్యాధి అని, అందుకే 30 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బీపీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో మారుతున్న జీవనశైలి, విపరీతమైన ఒత్తిడి, తగిన శారీరక వ్యాయామం లేకపోవడం, ఆహారంలో అధికంగా ఉప్పు వాడటం వల్లనే హైపర్‌టెన్షన్ సమస్య సమాజంలో వేగంగా పెరుగుతోందని చెప్పారు. దీని నిర్లక్ష్యం చేయడం వల్ల గుండెపోటు, పక్షవాతం, మూత్రపిండాల వ్యాధులు వంటి ప్రాణాంతక సమస్యలు వస్తాయన్నారు. దీని నివారణకు రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో ఆసుపత్రి ఆర్ఎమ్ఓ డాక్టర్ విజయ్, డాక్టర్ సుష్మిత, పాలియేటివ్ కేర్ వైద్య అధికారి డాక్టర్ హరి కిషన్, ఎన్సిడి కోఆర్డినేటర్ లు మధుసూదన్, తీట్ల రాజేశం, వి. శ్రీనివాస్, నర్సింగ్ సూపరింటెండ్ జమున, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.



# పెద్దపల్లి వార్త

## మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం కాపాడడం మా బాధ్యత

పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

కార్మికుల కోసం ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందజేసిన మెడికల్ సిబ్బంది

**పెద్దపల్లి, ప్రభాతవార్త:**



మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం కాపాడడం మా బాధ్యత అని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులకు అందించే ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను మెడికల్ సిబ్బంది మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నూగిల్ల మల్లయ్య మాట్లాడుతూ తీవ్రమైన వేసవికాలం దృష్ట్యా మున్సిపల్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. ఎండ తీవ్రతకు కార్మికులు అస్వస్థతకు గురికాకుండా ఉండేందుకు ఈ ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్మికుల కోసం ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందించినందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కు, వారి మెడికల్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మెడికల్ సిబ్బంది ఎస్.మమత, ఏ.నిర్మల, జి.పద్మ, వి.మమత, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు అవసరం

గ్రామ సర్పంచ్ మ్యాడగోని శ్రీనివాస్ గౌడ్

హనుమంతునిపేటలో హమాలీలకు మజ్జిగ ప్యాకెట్ల అందజేత

**పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:**



వేసవి కాలంలో కార్మికులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని గ్రామ సర్పంచ్ మ్యాడగోని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. సోమవారం పెద్దపల్లి మండలం హనుమంతునిపేట గ్రామంలో హమాలీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మ్యాడగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కఠినమైన ఎండల్లో ఉపాధి కోసం శ్రమిస్తున్న హమాలీ కార్మికులకు ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ ప్యాకెట్లను అందజేసినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక హమాలీ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నల్లాలకు బిల్లులు చెల్లించడం న్యాయం కాదు

23వ వార్డు కౌన్సిల్ సభ్యుడు జడల సురేందర్

**పెద్దపల్లి, ప్రభాతవార్త:**పనిచేయని మిషన్ భగీరథ నల్లాలకు బిల్లులు చెల్లించడం ఎంతమాత్రం న్యాయం కాదని మున్సిపల్ కార్యాలయం 23 వ వార్డు కౌన్సిల్ సభ్యుడు జడల సురేందర్ స్పష్టం చేశారు. సోమవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో 23 వ వార్డు కౌన్సిల్ సభ్యుడు జడల సురేందర్ పాల్గొని వార్డులోని ప్రజా సమస్యలపై మాట్లాడారు. పట్టణంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇళ్లకు ఏర్పాటు చేసినటువంటి నల్లా కనెక్షన్లు దాదాపుగా సగం వరకు అస్సలు పనిచేయడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. దాదాపుగా ప్రజలకు ఎవరికీ కూడా ఆ నల్లాల ద్వారా నీళ్లు వచ్చిన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు నీళ్లే రానప్పుడు అటువంటి పనిచేయని కనెక్షన్లకు మున్సిపాలిటీ తరఫున బిల్లులు చెల్లించబడడం సరైన పద్ధతి కాదని, దీనిపైన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మళ్ళీ వారే ఉండాలి...వారికే మా మద్దతు



చొప్పదండి,ప్రభాతవార్త:

నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నిక ల నిమిత్తం సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మండల కాంగ్రెస్ కార్యకర్తల, ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశం లో మళ్ళీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గా ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గా నిజానపురం చందు లే ఉండాలని ఏక గ్రీవ తీర్మానం చేశారు. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మండల కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ముందుకు సాగుతుందని, వారి నేతృత్వం పార్టీ ఏక త్రాటి పై ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. మా పై నమ్మకం ఉంచిన పార్టీ బంధువులకు రుణపడి ఉంటామని, పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు, మున్సిపల్ వైస్ చైర్మన్ పెరుమాండ్ల మానస గంగయ్య, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, కౌన్సిలర్ లు కొట్టె సునీత అశోక్, వడ్లూరి అనూష శ్యాంసుందర్, పిట్టల వెంకటేష్, ముద్దం రాజేశ్వరి తిరుపతి, మాజీ ఎంపీటీసీ ముద్దసాని రంగన్న, సర్పంచ్ లు చొక్కాల తిరుపతి, మాచర్ల జగన్, బద్దెనపల్లి సతీష్, పెద్దెళ్లి సురేష్, నాయకులు మునిగాల చందు, మునిగాల సుధాకర్, గుర్రం రమేష్, కదారి శంకర్, మహేషుని మల్లేశం, అనుమాండ్ల సత్యం, పెద్ది రాజేందర్, ఆకుల సురేష్, రాపెల్లి ఐలయ్య యాదవ్ పాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

చొప్పదండి,ప్రభాతవార్త:



బాలికలు వారి వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని చొప్పదండి మండల వైద్యాధికారి కీర్తన పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సెల్ప్ హెల్ప్ గ్రూప్ సభ్యుల పిల్లలకు ముఖ్యంగా 15 నుండి 18 సంవత్సరాల అడొలెసెంట్ యువతుల కోసం ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహించారు. డయాబెటిస్ మెల్లిటస్, రక్తహీనత, బి ఎం ఐ పరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహించారు. అనీమియా ను ఎదుర్కోవడం వరకు, రుతు స్రావ పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై పై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సురేందర్, మానస, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటస్వామి, పర్యవేక్షకులు జకీర్ హుస్సేన్, ఎ ఎన్ ఎం లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో నేరెళ్ల శ్రవణ్ మృతి

మల్యాల /ప్రభాతవార్త



మల్యాల మండల కేంద్రానికి చెందిన బిజెపి మండల మాజీ అధ్యక్షులు నేరెళ్ల శ్రవణ్ కుమార్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు, ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుది శ్వాస విడిచారు, ఈ సందర్భంగా శ్రవణ్ మృతి పట్ల నాయకులు పార్థివ దేహాన్ని సందర్శించి తమ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి అంతిమయాత్రలో పాల్గొన్నారు,, శ్రవణ్ మృతి పార్టీకి తీరనిలోటని బిజెపి నాయకులు పేర్కొన్నారు, ఇదిలా ఉండగా బారాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ లు శ్రవణ్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు,

## ఉచిత విద్యను అందించిన సదిశ స్వచ్ఛంద సంస్థ

చొప్పదండి,ప్రభాతవార్త:



సదిశ స్వచ్ఛంద సంస్థవారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు డిసెంబర్ లో నిర్వహించిన గణిత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ముప్పై నాలుగు మంది విద్యార్థులను ఎంపిక చేసిన వారిని శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ కరీంనగర్ లో చేర్పించడం జరిగింది. వీరికి ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల ఉచిత విద్య, హాస్టల్ వసతి, ఖర్చులు మొత్తం సంస్థవారు భరిస్తారని సంస్థ నిర్వాహకులు ద్యావ నవీన్ రెడ్డి, గజ్జల ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ ముద్దసాని రమేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ జగన్మోహన్ రెడ్డి,శ్రీనివాస్, తల్లిదండ్రులు, స్టూడెంట్స్ పాల్గొన్నారు...

## మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషి చేయాలి

చొప్పదండి,ప్రభాతవార్త:



మున్నూరు కాపు సంఘం బలోపేతం కై ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పిలుపును ఇచ్చారు. ఈ మేరకు సోమవారం చొప్పదండి మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షులు కొట్టె చందు, మండల ప్రధానకార్యదర్శి అమెరిశెట్టి వెంకటేష్ లు మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా చందు, వెంకటేష్ లను అభినందిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయంగా, సామాజికంగా చైతన్యం కావలిసిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి వెంటనే భర్త రఫ్ చేయాలి



గంగాధర,ప్రభాత వార్త :

కేంద్ర మంత్రి బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి వెంటనే బర్త్ రఫ్ చేయాలని కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై గంగాధర చౌరస్తా లో బి ఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ ధర్నా చేశారు.ఆయన కుమారుడు పై నమోదైన ఫోక్సో కేసు కారణంగా నైతిక బాధ్యత వహిస్తూ తన పదవి కి వెంటనే రాజీనామా చేయాలని అన్నారు బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ పై నమోదైన ఫోక్స్ కేసు మరియు ఇతర ఆరోపణ కారణంగా కేంద్ర మంత్రిగా బండి సంజయ్ పదవిలో కొనసాగడం పై దర్యాప్తును ప్రభావితం చేస్తుందని ఆరోపించారు. తక్షణమే మంత్రివర్గం నుండి బర్త్ రఫ్ చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు

## ఉపాధి కూలీలు ఉదయం 10 లోపే పనులు ముగించాలి

మల్యాల/ ప్రభాతవార్త



వేసవి ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతిరోజు ఉదయం 6 నుండి 10 గంటల వరకే పనులు చేపట్టాలని మల్యాల మండలంలోని మద్దుట్ల గ్రామ సర్పంచ్ సంకుర్తి తిరుపతి అన్నారు, సోమవారం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పని ప్రదేశాలను పరిశీలించిన అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు, అంతేకాకుండా ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ కు సూచించారు, కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు పంచాయతీ కార్యదర్శి అజేందర్ రెడ్డి, గ్రామ పరిపాలనాధికారి శంకర్, వార్డు సభ్యులు శ్రీనివాస్, తిరుపతి గౌడ్, పవన్ రావు సాయి వర్ధన్, నితిన్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, మహేష్, మల్లేష్ పాల్గొన్నారు,

# చొప్పదండి వార్త



## విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

చొప్పదండి,ప్రభాతవార్త:



ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు536/600 సాధించిన దళిత పేద విద్యార్థి అయిన చాతర్ల. హర్షిత్ కుమారు కు అదే పాఠశాలలో 198485 సంవత్సరంలో ఏడవ తరగతి చదువుకున్న విద్యార్థులు కలిసి 10000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హర్షిత్ కుమార్ తండ్రి అంజయ్య తల్లి లత కూలి పనులు చేసుకుంటు కుమారున్ని ను చదివించుకుంటున్న సందర్భంలో భవిష్యత్తులో ఇంకా ఉన్నతమైన చదువులు చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని, ఇంకా కూడా భవిష్యత్తులో ఎలాంటి సహాయమైనా తాము చేస్తామని వారు పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం

చొప్పదండి,ప్రభాతవార్త:



రాష్ట్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని కొండగట్టు ఆలయం ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 35మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు, మున్సిపల్ వైస్ చైర్మన్ పెరుమాండ్ల మానస గంగయ్య, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, కౌన్సిలర్ లు కొట్టె సునీత అశోక్, వడ్లూరి అనూష శ్యాంసుందర్, పిట్టల వెంకటేష్, ముద్దం రాజేశ్వరి తిరుపతి, మాజీ ఎంపీటీసీ ముద్దసాని రంగన్న, సర్పంచ్ లు చొక్కాల తిరుపతి, మాచర్ల జగన్, బద్దెనపల్లి సతీష్, పెద్దెళ్లి సురేష్, నాయకులు మునిగాల చందు, మునిగాల సుధాకర్, గుర్రం రమేష్, కదారి శంకర్, మహేషుని మల్లేశం, అనుమాండ్ల సత్యం, పెద్ది రాజేందర్, ఆకుల సురేష్, రాపెల్లి ఐలయ్య యాదవ్ పాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక కు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

చొప్పదండి,ప్రభాతవార్త:

మైనర్ బాలిక కు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చొప్పదండి లో విలేకరుల తో మాట్లాడుతూ విలువలు లేని బండి సంజయ్ భేషరతుగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కె టి ఆర్ పై నోటికి వచ్చినట్లు మాట్లాడిన బండి సంజయ్ ఈ రోజు కుమారుని విషయంలో నా పేరు ప్రస్తావించ వద్దు అంటూ కోర్టు మెట్లు ఎక్కడం దారుణం అన్నారు. కేంద్ర మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫోక్స్ కేసు నుండి కొడుకును కాపాడు కోవడానికి అధికార దుర్వినియోగం కు పాల్పడినట్లు కేంద్ర బిజెపి నాయకత్వం ఇప్పటికే గుర్తించి నట్లు ప్రచారం జరుగుతోందని, ఈ పరిస్థితుల్లో వెంటనే బండి సంజయ్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కె టి ఆర్ ను నానా దుర్భాషలాడి, కె సి ఆర్ కుమారుడిగా పేర్కొంటూ వారిపై చేసిన వ్యాఖ్యలు అప్పుడే మర్చి పోయినట్లు బండి సంజయ్ ఉన్నారని, కానీ ఈ రోజు తనదాక వచే సరికి ఈ రోజు తన కుమారుడు విషయంలో నా పేరును వాడవద్దు అనడం దారుణం అన్నారు. ఇప్పటికైనా నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ రాజీనామా చేయాలని రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# దరఖాస్తుకు ఏడాది.. మంజూరు జాడేది?..

### మంజూరు లేక మూతబడిన యూనిట్లు..
### యువత ఆశలు అర్ధాంతరంలో..

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మంజూరు కాని రాజీవ్ యువ వికాస యూనిట్లు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతున్నారు. స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు కూడా పూర్తిచేసినప్పటికీ, ఏడాది గడిచినా మంజూరు ప్రక్రియ ముందుకు సాగకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. దరఖాస్తులు పూర్తి.. ఇంటర్వ్యూలు పూర్తి.. అయినా యూనిట్లు ప్రారంభం కాకపోవడంతో యువకులు రోజులు లెక్కపెడుతూ ఎదురుచూస్తున్నారు. ఈ యూనిట్లు ప్రారంభమైతే దర్జీ పని, చిన్న వ్యాపారాలు, కంప్యూటర్ సేవలు, మెకానికల్ పనులు వంటి రంగాల్లో నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుని స్వయం ఉపాధి పొందాలని ఆశించిన వారికి నిరాశ మిగిలింది. "స్కిల్ అభివృద్ధి - ఉపాధి




హామీ" అనే లక్ష్యంతో ప్రకటించిన ఈ యూనిట్లు కాగితాలకే పరిమితమైపోవడంతో, నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల మంజూరు ఆలస్యం అవుతుందా? లేక పరిపాలనా సమస్యలే కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తక్షణం మంజూరు ప్రక్రియ పూర్తి చేసి, రాజీవ్ యువ వికాస యూనిట్లను ప్రారంభించాలని యువత మరియు స్థానికులు కోరుతున్నారు.

# కాంగ్రెస్, బిజెపి కలిసి బండి సాయి భగీరథ్‌ను కాపాడాలని చూస్తున్నాయి

### బండి సంజయ్‌ని కేంద్ర మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలి
### తెలంగాణ చౌక్‌లో ప్లకార్డులతో బిఆర్ఎస్ శ్రేణుల ధర్నా

వేములవాడ, ప్రభాతవార్త:

కాంగ్రెస్, బిజెపి కలిసి బండి సాయి భగీరథ్‌ను కాపాడాలని చూస్తున్నాయని బిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు పార్టీ వేములవాడ ఇన్‌ఛార్జ్ చల్మెడ లక్ష్మీన రసింహా రావు ఆదేశాలతో వేములవాడలోని తెలంగాణ చౌక్‌లో బిఆర్ఎస్ పట్టణ, అర్బన్, రూరల్, కోనరావుపేట మండలాల పార్టీ శ్రేణులు ప్లకార్డు లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మైనర్ బాలికను అత్యాచారం చేసిన బండి సాయి భగీరథ్‌కు శిక్ష పడాలంటే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బేటి బచావో-బేటి పడావో




అన్న నినాదాన్ని కాపాడాల్సిన బాధ్యత బండి సంజయ్‌పై లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు కలిసి పని చేస్తున్నాయని, బండి సంజయ్ కొడుకు కేసు విషయంలో తేటతెల్లం అయిందన్నారు. ఈ నిరసనలో వేములవాడ పట్టణ సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, అర్బన్ మండల సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్ రావు, రూరల్ మండల అధ్యక్షులు గోసుకుల రవి, నాయకులు మ్యాకల రవి, కోనరావుపేట మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలున్నారు.

# భక్తజనంతో కిక్కిరిసిన భీమన్న ఆలయం

వేములవాడ, ప్రభాతవార్త:

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తజనంతో కిక్కిరిసింది. వేసవి సెలవులు, సోమవారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ భారీగా నెలకొంది. రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం సరస్వతి నది అంత్య పుష్కరాలు, సమ్మక్క సారలమ్మ జాతర, తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం దేవస్థానం వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే ముందు వేములవాడకు వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు, సంతానప్రాప్తి, నూతన దంపతుల శుభజీవితం, కుటుంబ సౌఖ్యం వంటి కోరికలు స్వామివారిని ప్రార్థిస్తే నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. కోరికలు తీరిన అనంతరం



భక్తులు తలనీలాలు, కోడె మొక్కులు, రుద్రాభిషేకాలు, అన్నపూజలు, నిత్యకళ్యాణాలు, చండీ హోమాలు, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, మహాలింగార్చనలు, ఆకుల పూజలు తదితర మొక్కులు చెల్లిస్తున్నారు. అంతేగాకుండా ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయంగా విరాళాలను కూడా సమర్పిస్తున్నారు. సోమవారం సందర్భంగా భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో ఆలయ ఈవో ఎల్.రమాదేవి ఆలయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. అతిశీఘ్ర దర్శనం, శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, అభిషేక టికెట్ల కౌంటర్లు, అద్దె కోడెల విభాగం తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించి, భక్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భాస్కర శర్మ, ఆలయ ఏఈఓ జి.శ్రావణ్, ప్రొటోకాల్ ఏఈఓ జి.అశోక్, ఆలయ ఉద్యోగులున్నారు.

# పేదల సొంతింటి కలలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి / ప్రభాతవార్త:

పేదల సొంతింటి కళలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం సనుగుల గ్రామంలోనీ గంగిరెడ్డుల కాలనీలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే, మహేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు నాగం కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొట్టే ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపంటి రామస్వామి నాయకులు బొడిగె అనిల్, రామిని





# వేములవాడ వార్త

## 20న మెడికల్ షాపుల దేశవ్యాప్త బంద్

ప్రభాత వార్త కోనరావుపేట:



ఆల్ ఇండియా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త మెడికల్ షాపుల బంద్‌కు ప్రజలు సహకరించాలని కోనరావుపేట మండల మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు సమావేశమై బంద్‌కు మద్దతు ప్రకటించారు. మూడు ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఒక్కరోజు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్సై ప్రశాంత్ రెడ్డి, ఎంపీడీవో స్మిగ్ధరెడ్డి తహసీల్దర్ కార్యాలయాల్లో డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్ లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గంగాధర్, సమ్మయ్య, దామోదర్, లక్ష్మీ ్మరాజం, మధుకర్ రెడ్డి, రాములు, లక్ష్మీ ్మకాంతం, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి ఉచిత ఇంటర్ విద్యా అవకాశం

వేములవాడ రూరల్ ప్రభాతవార్త:



వేములవాడ రూరల్ మండలంలోని హనుమాజీపేట గ్రామాంలోని పి ఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ హనుమాజీపేట పాఠశాల విద్యార్థి మల్లే వెంకటేశ్వర్లు, డిసెంబర్ 2025లో సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెరిట్ స్కాలర్షిప్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెరిట్ సాధించాడు. విద్యార్థి సాధించిన ఈ ప్రతిభకు గుర్తింపుగా శ్రీ చైతన్య జూనియర్ కళాశాల వారు కరీంనగర్‌లోని తమ కళాశాలలో రెండు సంవత్సరాల పాటు ఉచిత ఇంటర్ విద్యను అందించేందుకు ప్రవేశం కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఈ స్థాయి విజ యాన్ని సాధించడం పాఠశాలకు గర్వకారణమని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు శ్రీ చిట్నేని శ్రీకాంత్ రావు తెలిపారు. విద్యార్థి కృషి, ఉపాధ్యా యుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం కలిసి ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా మెరిట్ సాధించిన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ జంకె మధు, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ ప్రజలు అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

## పింఛన్ కొనసాగింపుకు లైవ్‌నెస్ అథెంటికేషన్ తప్పనిసరి

### ఎంపీడీవో స్మిగ్ధా రెడ్డి

**ప్రభాతవార్త కోనరావుపేట** కోనరావుపేట మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం కీలక సూచనలు జారీ చేసింది. ఈ నెల 15వ తేదీ నుంచి పింఛన్ లైవ్‌నెస్ అథెంటికేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి స్మిగ్ధ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛన్ పొందుతున్న ప్రతి లబ్ధిదారుడు తమ గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి ఆన్‌లైన్ ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జీవించి ఉన్న పింఛన్ లబ్ధిదారుల వివరాలను నిర్ధారించేందుకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే పింఛన్ పొందుతున్న వారిలో ఎవరినీ తొలగించడం లేదని, అలాగే కొత్త సభ్యులను ఈ ప్రక్రియలో చేర్చడం లేదని స్పష్టం చేశారు. అయితే నిర్దేశిత సమయంలో ధృవీకరణ పూర్తి చేయకపోతే పింఛన్ నిలిచిపోయే అవకాశం ఉండటంతో లబ్ధిదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి

జూలై నుంచి వీబీజీ రాంజీ పథకంగా పేరు మార్పు

జిల్లా డీఆర్డీఓ అధికారిణి కాళిందిని

రామగిరి ప్రభాతవార్త

జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఆర్డీఓ అధికారిణి కాళిందిని అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్, కల్వచర్ల, కమాన్ పూర్ తదితర తదితర గ్రామాలలో ఐకెపి సెంటర్లను ఆమె పరిశీలించారు. రామగిరి జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం (కే.వీ.కే) లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 263 గ్రామపంచాయతీలలో 1.39 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయని, ఇందులో 51,228 మంది కూలీలు యాక్టివ్ గా ఉండగా, ప్రస్తుతం 26 వేల మంది ఉపాధి కూలీలు పనిలోకి వస్తున్నారని తెలిపారు. వేసవికాలం కావడంతో ఉపాధి పనులు జరిగే ప్రాంతాలలో త్రాగునీరు సౌకర్యం కల్పించాలని, చిన్నపాటి షెడ్ లు వేయాలని, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందించాలని ఆమె సూచించారు. ప్రస్తుతం జరిగే పథకం పేరును జూలై నుంచి వీబీజీ రాంజీ పథకం కింద ప్రభుత్వం మార్చిందని ఆమె తెలిపారు. నూతన పథకంలో 125 రోజులు పని దినాలు కల్పిస్తున్నామని అన్నారు. గొర్రెలు, బర్రెలు, పౌల్ట్రీ కింద షెడ్యూలు నిర్మించుకోవచ్చునని దీనికి



పూర్తిస్థాయిలో సబ్సిడీ ఉందన్నారు. రైతులు పొలాలలో వరద కట్టలు నిర్మించుకోవచ్చునని, అజోలా, నాడెం కంపోస్ట్ కన్స్ట్రక్షన్ నిర్మించుకోవడానికి భారీగా నిధులు ఉన్నాయని తెలిపారు. స్వశక్తి గ్రూప్ మహిళలకు ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. స్వయం శక్తి పథకాలకు రూ. 5 లక్షల వరకు రుణాలు అందిస్తామని ఆమె తెలిపారు. మహిళలకు డ్రైవింగ్ లో టూ, ఫోర్ వీల్ పై ఉచిత శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో కేంద్రం లో ఆమె పర్యటించారు. అక్కడ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు, ఎంపీడీవో బర్ల శైలజ రాణి, ఉపాధి ఏపీవో వరకొల్లు మోనిక, కెవికె శాస్త్రవేత్తలు అమనగంటి శ్రీనివాస్, నవ్య రావు, సెక్రటరీ గంగుల సంతోష్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ మల్కా అఖిల, ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని భూ కబ్జాదారుల నుండి కాపాడాలి

మంథని రూరల్ ప్రభాతవార్త:



గంగాపురి ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి ని కొంతమంది కబ్జా చేస్తున్నారు అని ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ ప్రజావాణిలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు . సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సిపిఎం నాయకులు గంగాపురి వాసులతో కలిసి ఆర్డిఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గంగాపురిలో ప్రభుత్వ పాఠశాల వెనకాల ఉన్న కొంత ప్రభుత్వ భూమిని క్రీడా ప్రాంగణానికి కేటాయించారని, ఈ క్రీడా ప్రాంగణానికి ఆనుకొని 971, 972, 973, 974 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి ఉందని ఇట్టి ప్రభుత్వ భూమిపై కొందరు భూకబ్జాదారులు కన్నేసి అక్రమంగా ఆక్రమించుకొని ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని అయన పేర్కొన్నారు.మిగతా కొందరు కబ్జా చేసి వ్యవసాయం చేసుకుంటున్నారని అన్నారు. క్రీడా ప్రాంగణం నిర్మాణానికి అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయని అన్నారు.గంగాపురి కాలనీలో చాలామంది నిరుపేదలకు కనీసం ఇండ్ల స్థలాలు కూడా లేవని అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ బ్రతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రధాన లక్ష్యమని చెప్పుకునే పాలకులు అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం కబ్జాకు గురైన గంగాపురి ప్రభుత్వ భూములపై సమగ్రమైన విచారణ జరిపి సర్వే చేయించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని కంచె ఏర్పాటు చేయాలని గంగాపురి కాలనీ వాసుల కోసం నిర్మాణం చేస్తున్న క్రీడా ప్రాంగణాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్మాణాన్ని పూర్తి చేయాలని మిగిలిన ప్రభుత్వ భూములను అర్హులైన గంగాపురి నిరుపేద ప్రజానీకానికి ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఆర్డిఓ యుద్ధ ప్రాదికన రెవెన్యూ అధికారులచే సర్వే చేయించి కబ్జా గురైన భూములను స్వాధీనపరచుకొని చుట్టూ కంచ ఏర్పాటు చేసి క్రీడా ప్రాంగణాన్ని పూర్తి స్థాయిలో నిర్మాణం చేసేలా చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు ఇవ్వటానికి పై అధికారులకు సిఫారసు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏల్పుల సురేష్ గంగాపురి కాలనీవాసులు ఎరుకల శేఖర్, హరీష్ పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

సర్పంచ్ మెంగని సమత తిరుపతి

ట్రైనర్ శ్యామల, కౌన్సిలర్ రజితకు ఘనంగా సన్మానం

ముత్తారం, ప్రభాతవార్త:



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సర్పంచ్ మెంగని సమత తిరుపతి కోరారు. సోమవారం ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో అలీఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం ముగిసింది. ఈ శిబిరంలో 25 రోజులపాటు మహిళలకు కుట్టు మిషన్ లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ట్రైనర్ శ్యామల, కౌన్సిలర్ రజితకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మెంగని సమత తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో అలీఫ్ సంస్థ ద్వారా మహిళలకు చేయూతను ఇస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థిక వృద్ధికి తోడ్పడుతున్న మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన



**మంథని రూరల్ ప్రభాతవార్త:** మండలం లోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని వేంపాడు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి సర్పంచ్ గుడిసె గట్టియ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. సోమవారం అయన డి ఎం ఎఫ్ టి నిధుల నుండి మంజూరైన రూ.30 లక్షలతో ప్రహరీ గోడకు భూమి పూజ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ నిధులు మంజూరు చేసిన ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో అభివృద్ధి చేసి చూపిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు కు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సురేందర్ రెడ్డి ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు సత్యం వార్డు సభ్యులు తోట శ్రవణ్ కాంగ్రెస్ నాయకులు కావటి సమ్మయ్య, కవటి సందీప్, అక్కపల్లి,నగరంపల్లి సర్పంచులు వేంపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

మంథని వార్త

# వరిలో సమతుల్య ఎరువుల వాడకంతోనే అధిక దిగుబడులు

-కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లా శాస్త్రవేత్త కిరణ్

-భూసార పరీక్షల విధానంపై రైతులకు ప్రత్యక్ష ప్రదర్శన



**ముత్తారం, ప్రభాతవార్త:** వరిలో సమతుల్య ఎరువుల వాడకంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి కిల్లా శాస్త్రవేత్త కిరణ్ తెలిపారు. సోమవారం ముత్తారం మండలం హరిపురం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లా, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ రైతులు స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్‌లను సరైన మోతాదులో వాడాలని పిలుపునిచ్చారు. వరిలో ఏ ఏ దశల్లో ఏ ఎరువులను ఎంత మోతాదులో వాడాలో, వాటి ప్రాముఖ్యతను వివరించారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగా, జనుములను పంట పొలాల్లో తప్పనిసరిగా సాగు చేసి కలియదున్నాలని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని సూచించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను, మట్టి నమూనాల సేకరణ విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో పెద్దపల్లి జిల్లా రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి పరీక్ష కార్డులను అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆయిల్ పామ్ తోటల్లో యాజమాన్య పద్ధతులు, వరి కోత తర్వాత మిగిలిన వ్యర్థాలను తగులబెట్టకుండా నేలలోనే కలియదున్నడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అనూష, వ్యవసాయ విస్తరణ అధికారి హారిక, గ్రామ సర్పంచ్ మెంగని సమత తిరుపతి, ఉప సర్పంచ్ కుస తిరుపతి, వార్డు సభ్యులు బండారి రవి, అడ్డూరి మోహన్, ఏజ్జ లత తిరుపతి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఉచిత కుట్టు శిక్షణ ముగింపు

రామగిరి ప్రభాతవార్త:

రామగిరి మండలం చందనాపూర్ గ్రామంలో మహిళల స్వయం ఉపాధి కొరకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ మొదటి బృందం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండ మంజుల శ్రీనివాస పటేల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలకు ఓపికతో నైపుణ్యంతో కుట్టు పని నేర్పించిన శిక్షకురాలు కీర్తనకు మొదటి బృందం మహిళలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వలాంబన సాధించాలనే లక్ష్యంతో మంత్రి శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి శీను బాబు సహకారంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభించడం జరిగిందన్నారు. మొదటి బృందం శిక్షణ పొందిన మహిళలంతా ఇప్పుడు సొంతగా కుట్టుకుంటూ ఉపాధి పొందే స్థాయికి రావడం సంతోషకరమని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని వారు ఆకాంక్షించారు. ఉచిత కుట్టు మిషన్ ఏర్పాటు చేసిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు, శీను బాబుకు, సహకరించిన గ్రామ సర్పంచ్ కొండ మంజుల శ్రీనివాస్ పటేల్ కు వార్డుసభ్యులకు మొదటి బ్యాచ్ మహిళ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# గురుకులాల్లో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే మౌలిక వసతులు కల్పించాలి

భారతీయ జనతా పార్టీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి

పెద్దపల్లి, ప్రభాతవార్త:



సమ్మర్ లోనే గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మత్తులు చేపట్టాలి అని భారతీయ జనతా పార్టీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లి జిల్లా పరిధిలోని గురుకుల పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్ల సమస్యలను కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే లోపే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఇంధన పొదుపును పాటించాలని, ప్రభుత్వ రవాణా రంగాన్ని బలోపేతం చేయాలని భావించిన నాయకులు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులో ఎక్కి కలెక్టరేట్ కు చేరుకోవడం విశేషం. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో కనీస మరుగుదొడ్ల సౌకర్యాలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గురుకులాల్లో చదువుకునే బాలికలు పారిశుధ్య లోపంతో తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పిల్లలకు మెరుగైన, పరిశుభ్రమైన వాతావరణం అందించాల్సి న కనీస బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేసింది. వేసవి సెలవుల్లోనే అన్ని గురుకుల పాఠశాలల్లోని మరుగుదొడ్ల మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక నిధులు కేటాయించి అధికారులు శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యల సాధన కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ పోరాటాలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ గౌడ్, బోడకుంట సుభాష్, ఊరగొండ అపర్ణ, పాకాల నరసింహారెడ్డి, కోడూరి రమేష్, ఏరుకొండ తిరుపతి, కొమిరే లక్ష్మణ్, మీస వికాస్, శిలారపు కళ్యాణ్, గన్న శ్రీనివాస్, కొట్టే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే అవినీతి నిరూపించాలి




-విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:** సుల్తానాబాద్ సహకార సంఘాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపామని, రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ మండిపడ్డారు. తనపై చేస్తున్న అవినీతి ఆరోపణలను దమ్ము, ధైర్యం ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. సోమవారం సింగిల్ విండో కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 13 సంవత్సరాలుగా రైతుల సేవలో నిబద్ధతతో పనిచేస్తూ మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందానని తెలిపారు. తిరిగి చైర్మన్‌గా ఎన్నిక కాకుండా అడ్డుకునేందుకే కొందరు అక్రమ ఆరోపణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సీడ్స్ అమ్మకాల వ్యవహారంలో సహకార సంఘానికి ఎలాంటి సంబంధం లేదని, ఇప్పటికే విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు విచారణ జరిపారని స్పష్టం చేశారు. ఒక రైతు వద్ద సీడ్స్ అమ్మి డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధమని పేర్కొన్నారు. అసత్య ప్రచారం కొనసాగిస్తే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. సుల్తానాబాద్ సహకార సంఘం అభివృద్ధిని అధ్యయనం చేసేందుకు వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, బ్యాంకు అధికారులు వస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రూర్బన్ నిధుల కింద మంజూరైన కోట్లాది రూపాయలను సక్రమంగా వినియోగించలేదని ఆరోపించారు. రూర్బన్ నిధులతో నిర్మించిన గోదాములు, షెడ్లు ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయని చెప్పారు. సంఘంలో రెండు వేల మంది సభ్యులు ఉండగా ఇంకా సభ్యత్వం కోసం రైతులు ముందుకు వస్తున్నారని తెలిపారు. రైతులకు తక్కువ ధరకే నిత్యావసర వస్తువులు అందిస్తూ సూపర్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తూ సభ్యుల అభిప్రాయాల మేరకే నిర్ణయాలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని 20 సంఘాల్లో ఎక్కడా లేని విధంగా రైతులకు ఆరు శాతం డివిడెండ్ పంపిణీ చేశామని, ఇప్పటివరకు రూ.75 లక్షల లాభాలను రైతులకు పంచినట్లు తెలిపారు. సంఘం నష్టాల్లో లేదని, ప్రస్తుతం లాభాల్లో కొనసాగుతోందని స్పష్టం చేశారు. రూ.7 కోట్ల రుణాల స్థాయి నుంచి రూ.400 కోట్ల వ్యాపార స్థాయికి సంఘాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజర్ కింద తెలంగాణలో ఎంపికైన సంఘాల్లో సుల్తానాబాద్ సంఘానికి చోటు దక్కడం గర్వకారణమన్నారు. పారదర్శకంగా నడుస్తున్న సంఘంపై బురద చల్లే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ముద్దసాని సురేష్ రెడ్డి, బండ గోపాల్, కూకట్ల ఓదెలు, తెలుకుంట్ల సుగుణాకర్, పూతర్ల కమలమ్మ, మానుపాటి పోచమ్మ, రైతులు అమ్ముల భూమయ్య, రాజయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన బిఆర్ఎస్ నాయకులు

ధర్మపురి, ప్రభాతవార్త.

ధర్మపురి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ను బి ఆర్ ఎస్ నాయకులు సోమవారం సందర్శించి, ధాన్యం ధాన్యం కొనుగోళ్ళను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్ మార్కెట్ యార్డ్ లోని సమస్యల్ని డిప్యూటీ తహసీల్దార్ కు వివరించారు. వరి ధాన్యం కొనుగోళ్ళలో క్వింటాలుకు సుమారు 5 కిలోలు కటింగ్ చేస్తున్నారని, ఇట్టి విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోళ్లలో జాప్యం జరగడంతో ఎండ తీవ్రతకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వీలైనంత త్వరగా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమస్యల్ని పరిష్కరించకుంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ సంగి సత్తమ్మ ,బి ఆర్ ఎస్ నాయకులు బండారి రంజిత్, ఒడ్నాల మల్లేశం, చిలివేరి శ్యామ్ సుందర్, పెరుమాండ్ల ఎల్లా గౌడ్, చిరినేని నర్సయ్య, చుక్క రవి, బండారి అశోక్, తరాల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

**చందుర్తి / ప్రభాత వార్త** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని నేల రోజులు గడుస్తున్నప్పటికీ కొనుగోలు చేయకపోవడం తో సోమవారం చందుర్తి మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చందుర్తిలో రాస్తారోకో, ధర్నా లు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ రావాలి వద్దు కొనాలి అంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కావడంతో ఎస్సై రమేష్ తన పోలీస్ సిబ్బందితో కలిసి ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకో, ధర్నా విరమింప చేశారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట బైఠాయించారు. తూకంలో కోతలు లేకుండా వారం రోజుల్లోనే వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తాసిల్దార్ భూపతి, ఏపీఎం కళ్యాణి లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య మాట్లాడుతూ వరి కోసి సుమారు 50 రోజులు గడుస్తున్న కొనుగోళ్లు మాత్రం జరగడం లేదని దీంతో రైతన్నలు ధాన్యాన్ని కాపాడుకునేందుకు కళ్ళల్లో వత్తులు వేసుకొని కల్లాల వద్ద కావలి కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు మరాటి మల్లిక్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్లు దప్పుల అశోక్, ఏనుగుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, నాయకులు ఏకే రావు, మ్యాకల పర్సరాములు, బైరగోని రమేష్, బొజ్జ దేవరాజు, ఎక్కలదేవి మహేందర్, గసికంటి కిషన్, ఐతం శ్రీను, అనంతుల మోహన్, రాజు వంశీ, మహేష్, వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.






# విడిసి భవనానికి భూమి కేటాయించి.. నిర్మాణ అనుమతులు జారీ చేయండి

-సర్పంచ్, పాలక వర్గం, పంచాయతీ కార్యదర్శులకు విడిసి విజ్ఞప్తి

బుగ్గారం ప్రభాతవార్త



జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటి బుగ్గారం కు పక్కా భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, నిర్మాణ అనుమతులు కూడా జారీ చేయాలని సోమవారం జరిగిన అత్యవసర పాలక వర్గం సమావేశంలో విడిసి విజ్ఞాపన పత్రాలు అందజేసింది. గ్రామ నడి బొడ్డున నిర్మాణ దశలో ఉన్న ఎంపిపి కార్యాలయం ప్రక్కన ప్రస్తుత పోలీస్ స్టేషన్ పార్కింగ్ స్థలంలో గ్రామ అభివృద్ధి కమిటి కి పక్కా భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని వారు కోరారు. విడిసి వ్యవస్థాపక అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, ఉపాధ్యక్షులు సుంకం ప్రశాంత్ లు గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ, పంచాయతీ కార్యదర్శి అక్బర్ లతో పాటు ఉప సర్పంచ్ జంగ లావణ్య, వార్డ్ సభ్యులకు వారు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఈ నాటి పాలక వర్గం సమావేశంలో తీర్మాణం చేసి, గ్రామ సభలో కూడా తీర్మాణం చేసి తీర్మానాల ప్రతులతో పాటు భవన నిర్మాణ అనుమతులు కూడా జారీ చేయాలని వారు కోరారు.

# సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్ల వినతి

ధర్మపురి, ప్రభాతవార్త:



తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ధర్మపురి మండల ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్మపురిలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆత్మకూరి లత, జిల్లా నాయకురాలు మామిడిపల్లి జ్యోతి లు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా రాష్ట్రములో 28 వేల మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని నేటి వరకు ఎంతో మంది పేదలకు సేవలందిస్తూ ఆరోగ్య పరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఇతర సౌకర్యాలను కల్పించాలని ఫిక్స్ రూ.18 వేలు వేతనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నేటి వరకు ఎటువంటి ఉద్యోగ భద్రత లేదని, తమకు భద్రత కల్పించాలని కోరారు. గతంలో నిర్వహించిన పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొని జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలన్నారు. ఈ శిబిరంలో పెద్దపల్లి పట్టణానికి చెందిన పడాల పద్మ రెండవ కూతురు కళ్యాణ లక్ష్మి దరఖాస్తు తీసుకునేందుకు ఆధార్ నెంబర్ తీసుకోవడం లేదని, దీనికి సంబంధించి సవరణ చేయాలని కోరగా మీసేవ రెవెన్యూ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఏ పార్టీలో ఉన్నాడు

- ఎమ్మెల్యే అవినీతి బయట పెడతా
- కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అడ్డుపడుతున్నాడు
- ఇప్పటికే సంవత్సరం వృధా చేసిండు
- నిజాంబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

చలిగల్ ప్రాంతంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అడ్డుపడుతూ సంవత్సర కాలం వృధా చేశాడని నిజాంబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పై మండిపడ్డాడుజగిత్యాల జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో సోమవారం నిజామాబాద్ ఎంపీ అరవింద్ ధర్మపురి తో కలిసి బిజెపి రాష్ట్ర నాయకు రాలు డాక్టర్ బోగ శ్రావణి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారుసందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతూకనెక్టివిటీ ఎక్సెబిలిటీ ఉండాలనే చల్ గల్ ప్రాంతంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రపోజల్ పెట్టామని పేర్కొన్నారు అభివృద్ధి నిరోధకుడు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అబద్దాలతో రాజకీయాల చేస్తున్నాడని మండిపడ్డాడుటీఆర్ఎస్ ను ఎందుకు వదిలినవ్. పార్టీ ఎందుకు మారినవ్.. కాంగ్రెస్ లో చేరి నువ్వు చేసిన అభివృద్ధి ఏంటిది చెప్పాలి అన్నారుబిడ్డ నిన్ను రాజకీయం గా నగ్నంగా చేసే వరకూ వదిలిపెట్ట ను అన్నారు దేశంలో అన్ని ప్రాంతాలలో 510 ఎకరాలు కేటాయించబడింది. జగిత్యాల లో మాత్రం రెండు ఎకరాలు ఇప్పించాడు విద్యార్థులకు ద్రోహం చేయడమేనని పేర్కొన్నారుఇది రిజక్ట్ అయితది అని తెలుసు. అందుకే ఈ ప్రతిపదన పెట్టిండు.డే స్కాలర్ స్కూల్ పిల్లల పోషకులు రెండు సార్లు వచ్చి వెళ్లాల్సి ఉంటది అన్నారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు స్థలం రాకముందు టెండర్, బడ్జెట్ ఏలా ఫైనల్ అయింది ప్రజలు ఆలోచన చెయ్యాలి అన్నారు సీఎం రేవంత్ రెడ్డి మోదీ దగ్గర ఆడుకుంటాడు. ప్రభుత్వం వద్ద పైసలు ఎక్కడివి అన్నాడు ఎమ్మెల్యే అడ్డం పడడం వల్ల ఒక ఏడాది విద్యా సంవత్సరం వెనకబడి పోయింది అన్నారు ఎమ్మెల్యే వి చాలా స్కామ్ లు ఉన్నాయి. ఒక్కొక్కటి బయట. పెడతాఅక్కల్ లేదు కాంగ్రెస్ నాయకులకు. ఉత్తమ్ కుమార్ వేస్ట్ . పిసిసి ఉన్నప్పుడు కేసీఆర్ కు టికెట్ లు అమ్ముకున్నాడు.సంజయ్ ముమ్మాటికీ బీఆర్ ఎస్ కే వెళ్తాడు. ఎస్పీ నౌకరి ఎక్కడి నుంచి తెచ్చుకున్నావు అని పేర్కొన్నారుఈ రోజు తప్పక గుర్తుంటాది.ఐపీఎస్ లు చదివి పాసై కాంగ్రెస్ రంగు పూసుకుంటా అంటే కుదరదు అన్నారు కాంగ్రెస్, బీఆర్ఎస్ కు అనుమతి ఎట్లా ఇస్తావ్. మాకూ ఎట్లా రిజెక్ట్ చేస్తవ్. అన్నిటికి సమాధానం ఇవ్వల్సి వస్తుంది అన్నారు సంజయ్ కుమార్ అర్వింద్ ధర్మపురి రాజకీయము ఇవాళ చూస్తావ్ ఇకనుండి కాస్కో అన్నారు రాజకీయం బారాబార్ చేస్తాం. సొల్లు పురాణం మాట్లాడుడు బంద్ చెయ్అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను విమర్శించారుఅకాడమిక్ ఇయర్ పోనివ్వను.. రెండేళ్లు లేట్ అయిన మంచి స్థలం లోనే పెట్టి తీరుత అన్నారు బీఆర్ఎస్ లో పుట్టి పెరిగినోళ్లు బావిలోని కప్పల లెక్కనే బతుకుతారు అన్నారు జగిత్యాల ప్రాంతంలో సగానికి ఎక్కువ సమన్య ప్రజలకు అవకాశం ఉంటుంది.బుల్లెట్ ట్రైన్ లు 2021 లో ఫైనల్ రిపోర్ట్ వచ్చింది, మోడీ 3 కారిడర్ లు ఇచ్చిండు తెలంగాణ కి అన్నారు ఎట్లా తెచ్చినవ్ తొండలు చూసి ఏమన్నా బుల్లెట్ ట్రైన్ అనుకున్నావా అన్నా రు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇగో వల్ల పట్టణం పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది.మంత్రికి బుద్ధి ఉండాలి కాదా. కేవీ కు రెండేకారాలు ఇస్తారన్నారుఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుపు రావు మరియు జిల్లా, మండల పట్టణ పదాధికారులు ముఖ్య నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- రూ.237 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- రైతులకు ఇబ్బందులు రానివ్వం
- మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:**

కరీంనగర్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, వచ్చేవారం లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల లక్ష యంగా నిర్దేశించామని, ఇప్పటి వరకు రైతులకు 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లు ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు.ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సీజన్లో 3.61 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటికీ 3 లక్షల ఒక వెయ్యి మెట్రిక్ టన్నులు కొనుగోళ్ల కోసం వచ్చిందని తెలిపారు.వచ్చిన ధాన్యం నుండి ఒక లక్ష 58 వేల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేశామని, రైతులకు ఇందుకు సంబంధించి 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయన్నారు.అధికారులు సమన్వయంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో 80,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. రానున్న వారంలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికతో ఉన్నామని అన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉంటూ సజావుగా సాగేలా చూడాలని తెలిపారు. రానున్న రెండు వారాలు మరింత కీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీల సమస్య ప్రధానంగా కనిపిస్తోందని, లోకల్ హమాలీలను ప్రోత్సహిస్తూ ఈ సమస్యను అధిగమించాలని మంత్రి సూచించారు. ధాన్యం రవాణాకు సంబంధించి పూర్తిస్థాయిలో అధికారాలు ఇచ్చామని, లారీ అసోసియేషన్ ప్రతినిధులు సహకరించి కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ట్రాన్స్పోర్ట్ కు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూసుకోవాలని, జిల్లా పంచాయతీ అధికారి హమాలీల సమస్య పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ధాన్యం లోడు పూర్తయిన ప్రతి వాహనం 24 గంటల్లోగా మిల్లులో అన్లోడ్ అయ్యేలా పక్కా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఎక్కువ పరిమాణంలో ధాన్యం కొనుగోలు చేస్తూ ఇంటర్మీడియట్ గోదాములను స్టోరేజీ కోసం వినియోగించాలని సూచించారు.మిల్లర్లకు అన్ని విధాలా ప్రభుత్వం సహకరిస్తుందని, అదే రీతిలో రబీ ధాన్యం కొనుగోళ్ల విషయంలో మిల్లర్లు అధికారులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తనీయవద్దని అన్నారు.కరీంనగర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 50శాతం కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో ముందున్నామని తెలిపారు. వారం రోజుల్లోనే 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మరో వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష యంగా పెట్టుకున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపుల విషయంలోనూ జిల్లా ముందు వరుసలో ఉందని తెలిపారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. 88శాతం ధాన్యం మిల్లర్లు స్వీకరించారని అన్నారు.ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, రైస్ మిల్లులు, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును లక్ష్యానికి అనుగుణంగా వేగవంతం చేయాలి

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీపై సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో పీపీబీ హోల్డర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా 80 శాతం ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును 95 శాతానికి చేర్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకొని అధికారులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా నమోదు శాతం తక్కువగా ఉన్న క్లస్టర్లపై ప్రత్యేక దృష్టి సారించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎం మార్క్ ఫెడ్ గౌరీ నాగేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో జోరుగా క్రికెట్ బెట్టింగ్

- వేలాది రూపాయలను నష్టపోతున్న రోజువారి కూలీలు
- పర్యవేక్షణ కరువు.. పట్టించుకునేవాళ్లే లేరు
- రూ. 1000 కి రూ. 2000



**కోరుట్ల, ప్రభాతవార్త :**

ఐపీఎల్ సీజన్ నడుస్తుండడంతో కోరుట్ల పట్టణంలో జోరుగా క్రికెట్ బెట్టింగులు సాగుతున్నాయి. క్రికెట్ బెట్టింగ్ లపై కన్నేయాల్సిన పోలీసులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూ ఉండడంతో ఈ బెట్టింగులు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. పట్టణంలో ముఖ్యంగా రోజువారి కూలీ పనులు చేస్తున్న వారిని టార్గెట్ గా పెట్టుకొని ఈ బెట్టింగులు నిర్వహిస్తున్నారు. బెట్టింగ్లో పాల్గొంటే రూ.1వెయ్యికి రూ. 2000 అంటూ సుమారు 10వేల వరకు బెట్టింగ్లు చేస్తూ కుటుంబాలను ఛిద్రం చేస్తుకుంటున్నారు. ఈ బెట్టింగ్ నిర్వాహకులు కూలీలు ఉండే ప్రాంతానికి వెళ్లి వారి పేర్లపై ఆయా టీమ్లను సెలక్షన్ చేసుకుని వారికి మరుసటి రోజు తెల్లవారుజామున గెలిచిన వారికి డబ్బులు నేరుగా ఇస్తుండడంతో ఇది చూసిన మరి కొంతమంది కూలీలు చేసిన పనికి వచ్చిన కూలీ డబ్బులను బెట్టింగ్ లో పెడుతూ నష్టపోతున్నారు.ఇంత తతంగం జరుగుతున్న ఈ బెట్టింగులపై కనీసం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు అధికారులు. ఈ బెట్టింగ్ల విషయంలో పోలీసులు శ్రద్ధ చూపితే ఈ బెట్టింగులు అరికట్టే అవకాశం ఉంది. ప్రధానంగా లేబర్లని టార్గెట్ చేస్తున్న బెట్టింగ్ నిర్వాహలను పోలీసులు గుర్తించి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

# బడ్జెట్ లక్ష.....?

- -సుక్కకు 60 వేలు...!ముక్కకు 40 వేలు...!
- -అడ్మిషన్‌కు ఎంతో మరి...?




**కరీంనగర్ ఎడ్యుకేషన్, ప్రభాతవార్త:**ప్రైవేట్ విద్యా సంస్థల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కరీంనగర్ జిల్లాలో విరాజిల్లుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి...జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థల వ్యాపారం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. తాజాగా నగరంలో పేరొందిన ఓ స్కూల్ కొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవం కోసం నిర్వహించిన బ్రోచర్ సెర్మోనీ ఖర్చుల గురించే ఇప్పుడు విద్యావర్గాల్లో చర్చ నడుస్తోంది. కార్యక్రమానికి వచ్చిన అతిథులు,నిర్వాహకుల మధ్య వినిపించిన లెక్కలు చూస్తే "స్కూల్ ప్రారంభమా... లేక వ్యాపార ప్రాజెక్టా...?" అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి... లాంచింగ్‌కే లక్ష దాటిందా...? ఓ స్కూల్ కొత్త బ్రాంచ్ ప్రచారం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్రోచర్ లాంచింగ్ కార్యక్రమంలో భారీగా ఖర్చు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మందు పార్టీకే సుమారు రూ.60 వేల వరకు ఖర్చు చేసినట్టు, మాంసాహార విందుకు మరో రూ.40 వేల వరకు బిల్లులు వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. కేవలం ఒక బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమానికే లక్ష రూపాయల వరకు వెచ్చిస్తే, ఆ డబ్బు తిరిగి రాబట్టేందుకు యాజమాన్యం ఎలాంటి మార్గాలు ఎంచుకుంటుందోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### అడ్మిషన్లపై కమిషన్ రాజకీయమా...?

ఇప్పటికే నగరంలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల కోసం మధ్యవర్తులను ఉపయోగిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో విద్యార్థి అడ్మిషన్‌పై వేల రూపాయల కమిషన్లు ఇచ్చే దందా నడుస్తోందని చర్చ జరుగుతోంది. కొత్త బ్రాంచ్ ప్రారంభిస్తున్న సదరు స్కూల్ కూడా అదే బాటలో నడుస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "లాంచింగ్‌కే ఇంత ఖర్చు చేస్తే, అడ్మిషన్‌ల కోసం ఎంత టార్గెట్ పెట్టుకుని ఉంటారు...?" అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష యంగా, నిబంధనలను పక్కన పెట్టే అవకాశమూ లేకపోలేదని వాదనలు వినిపిస్తున్నాయి.

### అనుమతులు అన్నీ వచ్చాయా...?

కొత్త బ్రాంచ్ ప్రారంభానికి సంబంధించి విద్యాశాఖ, ఫైర్ సేఫ్టీ, మున్సిపల్ అనుమతులు పూర్తిగా తీసుకున్నారా అనే అంశంపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. భవనం నిర్మాణ ప్రమాణాలు, పార్కింగ్ సౌకర్యం, పిల్లల భద్రత, ప్లేగ్రౌండ్ వంటి అంశాల్లో నిబంధనలు పాటించాల్సి ఉండగా, కొన్ని స్కూళ్లు కేవలం అడ్మిషన్ల కోసమే ముందుగా ప్రారంభాలు చేసి, తర్వాత అనుమతుల కోసం తిరుగుతున్న ఘటనలు గతంలో వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. సదరు కొత్త బ్రాంచ్ విషయంలో కూడా అన్ని శాఖల నుంచి పూర్తి క్లియరెన్స్ తీసుకున్నారా...? లేక "ముందు అడ్మిషన్లు... తర్వాత అనుమతులు..." అన్న ఫార్ములాతో ముందుకు వెళ్తున్నారా అన్న అనుమానాలు వినిపిస్తున్నాయి.భారీ ఖర్చులతో లాంచింగ్‌లు, కమిషన్ ఆధారిత అడ్మిషన్లు, ఆకర్షణీయ ప్రకటనలు చూస్తుంటే "పిల్లల భవిష్యత్తు" కంటే "ఫీజుల వసూళ్లు"కే ప్రాధాన్యం ఇస్తున్నారన్న అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికారులు ఇలాంటి కొత్త బ్రాంచ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫీజులు, అనుమతులు, భద్రతా ప్రమాణాలపై సమగ్ర పరిశీలన చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## ఆలయాల ఆదాయంలో కొండగట్టు అంజన్న రికార్డ్...

.భద్రాచలం రామన్న తర్వాతే అంజన్నకు ఆదాయంలో 4వ స్థానం





మల్యాల /ప్రభాతవార్త

తెలంగాణలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు లోని శ్రీ ఆంజనేయ స్వామి వారు ఆదాయ వనరులలో కూడా రికార్డు సాధించారు, 202526 సంవత్సరానికి గాను రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలలో ఆదాయ గణన లో కొండగట్టు అంజన్నకు నాలుగో స్థానం దక్కిందని ఆలయ అధికారులు తెలిపారు, కొండగట్టు ఆలయానికి రూ,21 కోట్ల 98 లక్షల 8046 ఆదాయం నమోదు కావడం ఇది రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలలో పోటీపడి నాలుగవ స్థానం కలిగి, మూడోస్థానం కలిగిన భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారికి నమ్మిన బంటు అంజన్నకు ఆయన వెంటే ఆదాయంలో కూడా నాలుగవ స్థానం తో వెన్నంటి ఉండడం విశేషం!, ఇదిలా ఉండగా, అత్యధిక ఆదాయం కలిగిన ఆదాయాలలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, వేములవాడ రాజరాజేశ్వర స్వామి, భద్రాచలం సీతారామచంద్రస్వామి, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం కు ఆదాయ నమోదులో రికార్డు సాధించడం, ఇటీవలే నీతి అయోగ్ దివ్య దర్శన్ లో కొండగట్టు ఆలయానికి స్థానం లభించడం తో పాటు ఆలయానికి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ గుర్తింపుసర్టిఫికెట్ లభించడంపట్ల ఆలయ అధికారులు, అర్చకు లు ఆనందం వ్యక్తం చేశారు, కాగా, కొండగట్టులో చిన్న ,పెద్ద హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా లక్షల్లో భక్తులు రాక తో పాటు ప్రతి శని, మంగళ వారాలలో భక్తుల రద్దీ తో పాటు భక్తులు హుండీలలో సమర్పించే కానుకలు ఆదాయ వనరులలో ప్రధానంగా నిలుస్తున్నాయి, ఆలయంలో పారిశుధ్యం, ప్రసాదాల తయారీ, శ్రీ స్వామివారి వివిధ సేవల టిక్కెట్ల అమ్మకం, ఆలయ అధికారులు హుండీ ఆదాయం పెరిగేందుకు తీసుకుంటున్న చర్య లమూలంగా టాప్‌టెన్‌లో కొండగట్టు అంజన్న నాలుగు స్థానం పొందారని అధికారులు పేర్కొంటున్నారు,

## మెరుగైన సేవలందించడమే గాయత్రి బ్యాంక్ లక్ష్యం



మల్యాల /ప్రభాతవార్త

మల్యాల మండల కేంద్రంలో గాయత్రి బ్యాంక్ ప్రారంభించి ఏడాది గడిచిన సందర్భంగా సోమవారం బ్యాంకు ప్రథమ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు, ఈ సందర్భంగా ఫిక్స్డ్ డిపాజిట్ దారులు, ఖాతాదారులకు స్వీట్లు పంపిణీ చేశారు, బ్యాంకు మేనేజర్ ఎం ఏ రహీం మాట్లాడుతూ, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తమ బ్యాంకు అందుబాటులో సేవలందిస్తుందని తెలిపారు, కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది సురేష్, అనిల్, రాజశేఖర్ ,నరేష్ ,శశి, వంశీ పాల్గొన్నారు,

## అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మల్యాల/ ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బిఆర్ఎస్



బిజెపి పార్టీల నుండి నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు, సోమవారం రాంపూర్ గ్రామ సర్పంచ్ బద్దం సంధ్య తిరుపతి రెడ్డి , ఉప సర్పంచ్ దున్నపోతుల మహేష్, వార్డు సభ్యులు హనుమంత రెడ్డి గణేష్, రాజు, చొక్కాయ లు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు,వారికి ఎమ్మెల్యే సత్యం కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు, పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు అందజేయడమే కాకుండా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామన్నారు,

## కోతుల బెడద నివారణకు సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ చేపట్టాలి



మల్యాల/ ప్రభాతవార్త

రైతులకు కోతుల నుండి పంట పొలాల రక్షణకు ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ అమలు చేయాలని మల్యాల మండలం మానాల గ్రామ సర్పంచ్ బలమూరి పాపారావు కోరారు, సోమవారం రైతు వేదికలో జరిగిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో రైతులు ఎదుర్కొంటున్న కోతుల సమస్యపై ప్రభుత్వం సోలార్ ఫెన్సింగ్ చేపట్టాలని కోరారు, మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్ మాట్లాడుతూ, వారి అవశేషాలను కాల్చకుండా నేలలో కలియ దున్నాలని వేసవిలో లోతు దుక్కులు దుండడం ద్వారా చీడపీడల నివారణ సాధ్యమవుతుందని అన్నారు, అంతే కాకుండా పామాయిల్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు, రైతులు అధిక మోతాదులో యూరియా వాడవద్దని, ఎరువుల సమతుల్య వినియోగం, పురుగుమందుల వాడకం, పర్యావరణ కాలుష్యం, తెగుళ్ళ నివారణ, పంటల మార్పిడి తదితరాంశాలపై శాస్త్రజ్ఞులు సాయినాథ్, సంధ్య కిషోర్ లు వివరించారు, అనంతరం ఖరీఫ్లో పంటల సాగు పై కరపత్రాలను ఆవిష్కరించారు, కార్యక్రమంలో ఏఈఓ మంజుల రైతులు పాల్గొన్నారు,

## ఎంసెట్ ఫలితాల్లో మాస్ట్రో కళాశాల విద్యార్థుల ప్రభంజనం



కోరుట్ల, ప్రభాతవార్త :

ఆదివారం ప్రకటించిన ఎంసెట్ 2026 ఫలితాలలో మాస్ట్రో జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ స్టేట్ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. కళాశాలకు చెందిన అల్లే కీర్తన 2960, నమిరా ముస్కాన్ 8521, చిలువేరి మధుప్రియ 11462, పడకంటి ప్రణవి 13414, క్యాతం అంజలి 14005, ఉజ్మా 14199, నేటి సంజన 14879 ఉత్తమ స్టేట్ ర్యాంకులు సాధించారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్ , ఉపన్యాసక బృందం అభినందించారు.

## జాతీయ టైక్వాండో ఛాంపియన్షిప్ లో రజతం సాధించిన అయేషా

కోరుట్ల, ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల్ జిల్లా లో ఈ నెల 15, 16, 17, 18 తేదీలలో నిర్వహించిన 16వ జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో 24కేజీల విభాగంలో కోరుట్ల పట్టణానికి చెందిన అయేషా మారియం పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రజత పథకం సాధించడం జరిగింది. అయేషా జాతీయస్థాయిలో పాల్గొన మొదటిసారే అత్యంత ప్రతిభ కనబరుస్తూ ఏళ్ల అనుభవజ్ఞులైన ప్రత్యర్థులతో పోరాడి ఒక్క పాయింట్ తో స్వర్ణం చేజారిన రజతం సాధించడం గొప్పగా ఉందని మాస్టర్ తైక్వాండో క్లబ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, నేషనల్ కోచ్, నేషనల్ రిఫరీ నావనంది రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ˇమా వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులు ప్రతిరోజూ కఠిన సాధన చేస్తూ తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారు. ప్రతి సంవత్సరం ఒక్కో మెట్టు ఎదుగుతూ, గతంలో కేవలం బ్రాంజ్ పతకాలకే పరిమితమైన స్థితి నుంచి ఈసారి 3 బంగారు, 2 రజత పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జి. సంతోష్ కుమార్, గంగారావు, ఎలుగందుల అజయ్, ఎండీ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మల్యాల/ ప్రభాతవార్త

మల్యాల మండల కేంద్రానికి చెందిన ఉద్యమకారుడు కర్బూజ నరసయ్య గౌడ్, నేరెళ్ల శ్రవణ్ కుమార్ లు అనారోగ్య సమస్యలతో మృతి చెందగా, సోమవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ వారి కుటుంబ సభ్యు లను పరామర్శించారు, ఈ సందర్భంగా వారి మృతి గల కారణాలను తెలుసుకొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు, కార్యక్రమంలో బారసా నాయకులు జనగాం శ్రీనివాస్, ముత్యంపేట మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ మిట్టపల్లి దశరథం , ఎండి సలీం, ఒల్లాల శ్రీనివాస్, కోటి రమేష్ పాల్గొన్నారు,

## 20న ప్రైవేట్ రంగంలో నిరుద్యోగులకు జాబ్ మేళా

మల్యాల/ ప్రభాతవార్త

జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకై ఈనెల 20న జగిత్యాల లోని ఎస్ కే ఎన్ ఆర్ ఆర్ట్స్ సైన్స్ కాలేజీ లో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్తెమ్మ ఒక ప్రకటన తెలిపారు, ఫోన్ పే, నివాబుప హెల్త్ ఇన్సూరెన్స్, కృషి విజ్ఞాన్ ఫర్టిలైజర్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, ప్రీమియం హెల్త్ కేర్ సర్వీసెస్, కేఎల్ టెక్నికల్ సర్వీసెస్ లలో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాల భర్తీకి ఆసక్తిగల అభ్యర్థులు జాబ్ మేళాలో విద్య అర్హత ధ్రువీకరణ పత్రాలతో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు,

## బూరుగు పల్లి లో నిత్య జన గణ మన.. రోడ్డు భద్రత పై ప్రతిజ్ఞ.



గంగాధర,ప్రభాతవార్త :

గంగాధర మండలంలోని బురుగుపల్లి గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద గంగాధర ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిత్య జన గణ మన మరియు రోడ్డు భద్రత పై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..దేశభక్తి భావాన్ని పెంపొందించడం ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంచడం లక్ష్యంగా ప్రతిరోజు జనగణమన మరియు రోడ్డు భద్రత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు అనంతరం గ్రామస్తులతో కలిసి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని హెల్మెట్ సీట్ బెల్ట్ వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు న డపడం అతివేగంగా ప్రయాణించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు అని గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దూలం కళ్యాణ్,గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు



## జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గా వోజ్జ రాజు,ప్రధాన కార్యదర్శిగా గండికోట సమ్మయ్య...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గా వోజ్జ రాజు,ప్రధాన కార్యదర్శిగా గండికోట సమ్మయ్య ఎన్నికయ్యారు. 40 సంవత్సరాలుగా జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని జమ్మికుంట ప్రాంతానికి కాకుండా కరీంనగర్ జిల్లా నాటి ఆంధ్రప్రదేశ్, నేటి



తెలంగాణ రాష్ట్రానికి అథ్లెటిక్స్ లో పథకాలు సాధించిన ఘనత జమ్మికుంట క్రీడాకారులదని కొనియాడారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసుకున్న సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది.గౌరవ అధ్యక్షులుగా రామ్ రాజబాబు, మార్కండేయ, దొడ్డ కుమారస్వామి, సలహాదారులుగా రమేష్ (ఆర్ పి ఎఫ్) సంపత్ (హెడ్ కానిస్టేబుల్) మారపల్లి మొగులయ్య రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, అధ్యక్షులుగా వోజ్జ.రాజు (అంతర్జాతీయ క్రీడాకారులు) అధ్యక్షులుగా రామ్ శ్రీనివాస్, ఎగిత అశోక్, డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) , వంతడుపుల రఘు, ప్రధాన కార్యదర్శిగా గండికోట సమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా బుర్ర కుమార్, కొలుగూరి సురేష్, కోశాధికారిగా తిరుపతి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా మాచర్ల రాజు, సమ్మయ్య (బ్యాంక్) గ్రౌండ్ కోచ్ లు కొలుగూరి నరేష్ కొయ్యడ సాయికృష్ణ ఎంపిక చేసుకోవడం జరిగింది.నూతనంగా ఎంపికైజమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు వోజ్జ రాజు ను, క్రీడాకారులు ఇవాళ జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికలలో పోటీలో నిలిచి ఘన విజయం సాధించిన ఎగిత అశోక్, కొలుగూరి సురేష్, మాచర్ల రాజు, గ్రౌండ్ కోచ్ లు కొలుగూరి నరేష్, కొయ్యడ సాయి కృష్ణ లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కొత్తపల్లి చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి చౌరస్తాలో మడిపల్లి వాస్తవ్యుడు మహమ్మద్ రియాజ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఇట్టి చలివేంద్రాన్ని ఆదివారం ఐదో వార్డ్ కౌన్సిలర్ యాట్ల సునీత




అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సునీత మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో తోటి ప్రజల దాహార్తిని తీర్చడానికి మంచి సంకల్పంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు రియాజ్ ను అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ విద్యావేత్త మహమ్మద్ అంకూష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం పట్టణ ప్రాంతానికి వచ్చినటువంటి ప్రజల యొక్క దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా అభినందనీయం అలాగే ప్రజలకు ఎంతో కొంత డబ్బు కూడా ఆదా చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఒకొంటే లీటర్ వాటర్ బాటిల్ రూ 20 పెట్టి కొంటున్న పరిస్థితిలో చల్లని మినరల్ వాటర్ అందించడం అనేది మంచి ఆలోచన సామాజిక దృక్పథంతో ఏర్పాటు చేసిన రియాజ్ ను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రంజాన్, పసరగొండ శ్రీనివాస్, ఫయాజ్, ఫరూక్, కుద్దుష్, అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంపులో గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్....

### డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా... ..

### పౌండర్, ప్రెసిడెంట్ డా సుంకరి యాదయ్య ( హన్సీ )...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా జమ్మికుంట పట్టణంలో, డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో కరాటే లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో



కటాస్, పంచ్, స్పైరింగ్, అఫెన్స్, డిఫెన్స్, బ్లాక్ పోటీలను దాదాపు రెండు గంటల వరకు నిర్వహించారు.విద్యార్థులు కరాటే లో చేసిన సాధనను ప్రదర్శించిన తీరు ఔరా అని అనిపించేలా ఉన్నాయి. పోటీలలో గెలుపొందిన విద్యార్థులు యెల్లో బెల్ట్ లో సాహితీ మాధవి, పారుపల్లి సంగీత,సాయి హర్షిత్, గ్రీన్ బెల్ట్ లో త్రివేద్, త్రినాధ్, బ్లూ బెల్ట్ లో మనస్విని, నిత్యశ్రీ, బ్రౌన్ బెల్ట్ లో వైష్ణవి, సాయి గణేష్ లకు డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా ఫౌండర్,ప్రెసిడెంట్ డా సుంకరి యాదయ్య ( హన్సీ )విద్యార్థులకు బెల్ట్స్, సర్టిఫికెట్స్ అందజేశారు.అనంతరం మాస్టర్ యాదయ్య మాట్లాడుతూ పిల్లలు విద్యార్థి దశ నుండే కరాటే లో కఠిన సాధన చేస్తూ పోటీలల్లో పాల్గొంటు తమ ప్రతిభ కనబరిస్తే యెల్లో, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులే కాకుండా బ్లాక్ బెల్ట్ నుండి రెడ్ బెల్ట్ పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఐతే బ్లాక్ బెల్ట్, రెడ్ బెల్ట్ లు సాదించాలంటే కఠిన సాధన అవసరమని విద్యార్థులకు వివరిస్తూ, మీకు నా ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని తెలిపి వారిని ఆశీర్వదించారు.

## బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని ఘనంగా సన్మానించిన మున్నూరు కాపు సంక్షేమ సంఘం నాయకులు...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సహకార కార్పొరేషన్ చైర్మన్ గా మున్నూరు కాపు ముద్దుబిడ్డ కరీంనగర్ పట్టణానికి చెందిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి నియామకం అయి, సోమవారంమున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రము లోని పద్మ నగర్ లో గల ఇందిరా గార్డెన్స్ లో నిర్వహించిఆత్మీయ అభినందన సభలో జమ్మికుంట మున్నూరు కాపు సంక్షేమ సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మున్నూరు కాపుల



ఐక్యతకు, సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొనగంటి మల్లయ్య, జమ్మికుంట అర్బన్ అధ్యక్షులు ఏబూసి శ్రీనివాస్, సీనియర్ నాయకులు సాయిని రవి, పొనగంటి రవీందర్, ఏబూషి ఓదెలు, మర్రి తిరుపతి, ఏ బూసి సంపత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని వినతి

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరుతూ సోమవారం హుజురాబాద్ కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రాన్ని ఆశా కార్యకర్తలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు వేతనం సక్రమంగా రావడం లేదని, 18000 వేల రూపాయలు ఫిక్స్ గా ప్రతి నెల ఒకటవ తేదీన అందే విధంగా చర్యలు తీసుకోవాలని, తమ సమస్యల కోసం సమ్మె చేసిన పరిష్కారం కాలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆశా కార్యకర్తలకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేసే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల సంఘ నాయకురాలు తాడూరి లత, నాయకురాళ్లు ఏడుముళ్ల సుజాత, జంగా రమాదేవి, మాదీన, తిరుపతమ్మ, భాగ్య, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.



## హుజూరాబాద్ డివిజన్‌లో భానుడి భగభగలు..

### 45 సెంటిగ్రేడ్‌లు దాటిన ఉష్ణోగ్రత..

### బోసిపోయిన గాంధీచౌక్..

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వాతవారణ శాఖ ముందస్తు హెచ్చరికలు చేసిన విధంగానే గత నాలుగు రోజులుగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డివిజన్ పరిధిలో భానుడి భగభగలు మరింత ముదిరిపోవడంతో సోమవారం హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్, సైదాపూర్, శంకరపట్నం మండలాల పరిధిలో ప్రజలు వేడి వడగాల్పులు, ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. ఉదయం 6గంటల ప్రాంతంలో డివిజన్ పరిధిలోని అనేక గ్రామాలలో 100రోజుల ఉపాధి హామీ పథకానికి వెళ్లిన కూలీలు ఉదయం 10గంటల కల్ల ఎండవేడిమిని తట్టుకోలేక సొమ్మసిల్లి పోయే పరిస్తితులు చోటు చేసుకున్నాయి. ఆ వెంటనే పనులు



ఆపివేసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఎండవేడిమికి గ్రామాలలో పశువుల కాపరులు, గొర్రెల కాపారులు మూగ జీవాలను ఉదయం 11గంటలలోపే ఇళ్లకు తరలిస్తున్నారు. డైరీఫాంలలో ఎండ వేడిమికి కోళ్ళ మృత్యువాత పడకుండా పొద్దస్థమానం ఫౌల్ట్రీ ఫాంల యజమానులు షెడ్‌ల వద్ద మోటార్‌లతో నీళ్ల కొడుతూ మూగజీవాలను కాపాడాసాగారు. హుజూరాబాద్, జమ్మికుంట ప్రధాన పట్టణాలలో 11గంటల తర్వాత జనం ఇండ్ల నుండి బయటకు రావడం మానివేయడంతో సాయంత్రం 4గంటల వరకు వ్యాపార, వాణిజ్య షాపులు, బట్టల షాపులు, హోటళ్ళ వెలవెలబోయాయి. జమ్మికుంట గాంధీచౌక్, హుజూరాబాద్ చౌక్‌లలో జనంలేక మండుతున్న ఎండలో బోసిపోయి కనిపించాయి. దంచికొడుతున్న ఎండల వల్ల హార్వెస్టర్లు పొద్దంత వరికోతలు కోయకుండా రాత్రి వేళల్లో, తెల్లవారుజామున వరికోతలు కోస్తున్నారు. రాష్ట్ర వాతవారణ శాఖ ఐఎమ్‌డి అధికారులు తెలిపిన వివరాల ప్రకారంగా కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలలో 45సెంటిగ్రేడ్‌లు దాటినట్లు వాతవారణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వేసవితాపానికి వృద్దులు, పిల్లలు అనారోగ్యంగా ఉన్నటువంటి వారు గడప దాటి కాలు బయట పెట్టడంలేదు. ఎక్కడ చూసిన ఎండవేడిమికి మనుషులతో పాటు మూగజీవాలు బయటకు రాకపోవడంతో ఎక్కడ నిర్మానుష్యంగా పట్టణాలు, గ్రామాలు మారిపోయాయి.

## సీనియర్ కాంగ్రెస్ నేత సలీం ఆకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు..

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త:

హుజూరాబాద్ నియోజకవర్గంలో గత 25 సంవత్సరాలుగా మంచి క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకునిగా అందరికి ఆదర్శంగా నిలిచిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సలీంపాషా ప్రమాదవశాత్తు ఆకాల మరణం చెందడం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ ఆవేదన వ్యక్తం చేసారు. సోమవారం సాయంత్రం జమ్మికుంట మున్సిపాలిటీ పరిదిలో ఉన్న ధర్మారం గ్రామానికి వెళ్లి ఒడితల ప్రణవ్ సలీం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏళ్ల తరబడి ఒకే రాజకీయ పార్టీని నమ్ముకుని ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్త మొదలుకుని, అంచలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో ఎదిగి, పార్టీలోని తోటి వారికి ఆదర్శంగా నిలిచిన నిబద్దత కలిగిన కార్యకర్త అని ఒడితల ప్రణవ్ కొనియాడారు. సలీం కుటుంబ సభ్యులకు దైర్యం చెప్పి పార్టీ పరంగా సలీంపాషా కుటుంబానికి అండగా ఉంటామని ప్రణవ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశిని కోటి మాట్లాడుతూ సలీంపాషా ప్రమాదంలో మృతిచెందడం ఈ ప్రాంతానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణవ్ వెంట సీనియర్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్, జిల్లా నాయకులు మొలుగూరి సదయ్య, రాష్ట్ర నాయకులు సాయిని రవి, నాయకులు బొంగోని వీరన్న, శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ పొనగంటి విష్ణులతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనలో భాగంగా కిశోర బాలికలకు ఉచిత వైద్య శిబిరం..

*హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:*

ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సోమవారం హుజురాబాద్ మెప్మా కార్యాలయంలో కిషోర బాలికల కోసం ప్రత్యేక రక్త పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల



సుహాసిని ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఉన్న కిశోర బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రక్త పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం హుజురాబాద్ డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ గొట్టె శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ... 15 నుండి 18 సంవత్సరాల వయసు గల కిశోర బాలికల కోసం అనీమియా (రక్తహీనత) గుర్తింపు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలోని బాలికలకు అనీమియా రక్త పరీక్షలతో పాటు, బిఎంఐ పరీక్షలు నిర్వహిస్తామని, అలాగే పర్సనల్ హైజిన్ (వ్యక్తిగత పరిశుభ్రత) పట్ల ప్రత్యేక అవగాహన కల్పిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, డాక్టర్ ప్రత్యూష, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు విజేందర్ రెడ్డి, లక్ష్మి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి

**- హుజురాబాద్‌లో బిఆర్ఎస్ భారీ ధర్నా, రాస్తారోకో**

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*

తన కుమారుడిని పోక్సో కేసు నుండి రక్షించుకోవడం కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన అధికార పదవిని దుర్వినియోగం చేస్తున్నారని, ఆయన తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బండి సంజయ్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ, ఆయన ఫ్లెక్సీలను దహనం చేశారు. ఈ నిరసనతో వరంగల్ - కరీంనగర్ జాతీయ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... ఒక మైనర్ బాలికను వేధించిన కేసులో బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను కాపాడటానికి కేంద్ర మంత్రి పదవిని అడ్డం పెట్టుకున్నారని ఆరోపించారు. హైదరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధిత బాలికను, ఆమె తల్లిని పోలీసులు ఎనిమిది గంటల పాటు స్టేషన్‌లోనే కూర్చోబెట్టడం, అంతకంటే ముందే కరీంనగర్‌లో భగీరథ్ తరపున కౌంటర్ కేసు నమోదు చేయించడం చూస్తుంటే అధికార దుర్వినియోగం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. 8 రోజుల పాటు ఎనిమిది పోలీస్ బృందాలు గాలించినా దొరకని సాయి భగీరథ్, కోర్టు బెయిల్ నిరాకరించిన వెంటనే పోలీసులకు ఎలా దొరికాడు....? ఒకవైపు పోలీసులు అరెస్ట్ చేశామని చెప్తుంటే, మరోవైపు తానే పోలీసులకు అప్పగించానని బండి సంజయ్ అనడంలో అసలు నిజమేంటో పోలీస్ శాఖ స్పష్టం చేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అమ్మాయిలకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదని, రాజకీయ పలుకుబడి ఉన్నవారి పిల్లలు చట్టానికి లోబడరనే విషయం ఈ కేసుతో నిరూపితమైందని వారు విమర్శించారు. బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేస్తేనే మైనర్ బాలిక కుటుంబానికి నిష్పక్షపాతంగా న్యాయం జరుగుతుందని, లేనిపక్షంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో బాధితురాలి తరపున పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మహిళా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేడు రైతువేదికలో వానకాల పంట సాగు పై అవగాహన సదస్సు.

*వీణ వంక,ప్రభాతవార్త:*

నేడు వీణ వంక మండల కేంద్రంలో నీ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు అనే కార్యక్రమములో భాగంగ రాబోయే వానకాలపు పంట సాగు సన్నద్ధం కోసం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించబడు తుందని,దీనికి పోతిరెడ్డి పల్లి,రామకృష్ణాపూర్, లస్మక్కపల్లి,నర్సింగాపూర్ గ్రామాల్లోని సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్ సభ్యులు,రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయ వంతం చేయగలరని వీణవంక విస్తరణ అధికారిని గౌతమి సోమవారం తెలిపారు

# ఉపాధి కూలీలకు ....మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసిన సర్పంచ్.

*వీణవంక, ప్రభాత వార్త:*



వీణవంక మండలము రామకృష్ణాపూర్ గ్రామం లో నీ శివారులో గల కుంటలో గత 15 రోజులుగా పనిచేస్తున్న 100 మందికి త్రాగు నీరు అందుతున్నప్పటికీ, ఎండ తీవ్రతలను దృష్టిలో ఉంచుకొని ,కూలీల సంక్షేమముకై ఆ గ్రామ సర్పంచ్ దూడపాక శ్రీవేణి రాజు సోమవారం వంద మంది కూలీలకు 100 మజ్జిగ ప్యాకెట్లను అందించి తన ఉదారతను చాటుకొన్నారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రారంభం

*కొత్తగూడ, మే 18, ప్రభాతవార్త*

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం విద్యా సంవత్సరానికి గానూ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ బి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఈ మేరకు స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో అడ్మిషన్లకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాన్ని మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రణధీర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఎంతో మేలు చేకూరుస్తాయన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అధునాతన వసతులు, ల్యాబులు, గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉచిత విద్య, ఉపాధి అవకాశాలు పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను ఉపయోగించుకుని ఉన్నత చదువులు చదవాలని కోరారు. అర్హులైన విద్యార్థులందరూ గడువులోగా ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, స్థానిక నాయకులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఇంధన ధరలు తగ్గంచాలి.

*కేసముద్రం, మే 18, ప్రభాతవార్త*

పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని కేసముద్రం అంబేద్కర్ సెంటర్లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆటోకు తాళ్లు కట్టి లాగుతు ఆందోళన, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ప్రతి నెల పెంచడం వల్ల జీవనోపాధి కోసం ఆటోలు నడుపుతున్న కార్మికులకుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు, పెట్రోల్ డీజిల్ గ్యాస్ వినియోగదారులకు ధరలు తగ్గించకుండా క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయని పొదుపుసూత్రాలుచెబుతూన్నారన్నారు. ఇంధన ధరలు పెరగడం వల్ల నిత్యవసర సరుకులుధరలుపెరుగుతాయని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ ఆయిల్ కంపెనీల లాభం కోసం ప్రజా వ్యతిరేకవిధానాలు మానుకొని ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు బొబ్బల యాకుబ్ రెడ్డి,చాగంటి కిషన్, నీరుటి జలంధర్, జల్లె జయరాజ్, సోమరపు ఎల్లయ్య, ఎండి యాకుబ్ పాషా, ఆటో కార్మికులు బెజ్జం నాగరాజు, ఎండి రబ్బాని, యాకన్న, పాషా పాల్గొన్నారు.



# కమిటీ నియామకం పట్ల హర్షం

*కేసముద్రం, మే 18, ప్రభాతవార్త*

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి కె.కేశవరావ్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసినందుకు కేసముద్రం మండల తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో మండల అధ్యక్షులు చాగంటి కిషన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను త్వరితగతిన గుర్తించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కమిటీ వెంటనే విధివిధానాలు ప్రకటించి తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలం, డబుల్ బెడ్ రూం, ఉద్యమకారుల గుర్తింపు, మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు 10 లక్షల ఆర్థిక సహాయం, అర్హత ఉన్న ఉద్యమకారులకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. గుగులోత్ దస్రూనాయక్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చాలని, కమిటీ కాలయాపన చేయకుండా వెంటనే హామీలను అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, జెఎసి పూర్వ కన్వీనర్ మోడెం రవీందర్ గౌడ్, విద్యార్థి, యువజన జెఎసి పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్, కర్పూరపు మురళి, తోట సుధాకర్, జల్లె జయరాజ్, బాలు మోహన్, సోమారపు వెంకటయ్య, చుంచు సూరయ్య, కీర్తి సమ్మయ్య, మాందాటి ఆంజనేయులు, నానబాల దూడయ్య, నాగరబోయిన చంద్రకళ పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ

*కొత్తగూడ, మే 18, ప్రభాత వార్త*

మండలంలోని గుంజేడు కు చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబర్ శిరబోయిన కళ్యాణ్ తల్లి కోమలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ జి ల్లా ప్రధానకార్యదర్శి బానోత్ రూపీసింగ్ వారి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. కోమలమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, ఓబీసీ జిల్లా జనరల్ సెక్రెటరీ వల్లపు రంజిత్, బిక్షపతి నివాళులర్పించారు.

# భక్తులకు ఇబ్బందులు కలగకుండా 14 గంటలు అప్రమత్తంగా ఉండాలి..

**-జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**-కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను పరిశీలన**

*మహదేవపూర్, మే 18, ప్రభాతవార్త*

సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరిశీలించారు. మే 21 నుండి జూన్ 01 వరకు కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చేపడుతున్న భద్రతా, బందోబస్తు మరియు ట్రాఫిక్ ఏర్పాట్లను జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పుష్కర ఘాట్లు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, కంట్రోల్ రూమ్, సీసీ కెమెరా పర్యవేక్షణ, భక్తుల రాకపోకలకు సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లను అధికారులతో కలిసి సమీక్షించారు.పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భద్రత పరంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ 24 గంటలు అప్రమత్తంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.అలాగే విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి భక్తులకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు. ఎస్పీ వెంట కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, మహదేవపూర్ ఎస్సై ఎన్.వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# గూడూరులో 2కె మారథాన్

*గూడూరు, మే 18, ప్రభాతవార్త*

ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం గూడూరులో ఫిజికల్ లిటరసీ కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు పట్టణంలో 2కె మారథాన్ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి తహసిల్ కార్యాలయం వరకు మారథాన్ కొనసాగింది. ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ మారథాన్ అండ్ ఫిజికల్ లిటరసీ అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఓ పృథ్వీరాజ్, ఎంఇఓ ఎ సుజాత, సిఐ వినయ్‌కుమార్, ఎస్ఐ గిరిధర్‌రెడ్డి, సర్పంచ్ వాంకుడోతు సునితకొమ్మాలు నాయక్, ఉపసర్పంచ్ చంటి స్వామి, పంచాయతి కార్యదర్శి మధుమోహన్‌నాయుడు, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, పంచాయతి, పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ఆటోను లాగుతూ సిపిఎం నిరసన



తల్లాడ, మే 18, ప్రభాతవార్త

సిపిఎం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ ఆటోను లాగుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వరుసగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ పేద, సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పేదల ప్రభుత్వం కాదు దోపిడి ప్రభుత్వం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, రాజబోయిన సైదులు, చల్లా నాగేశ్వరరావు, పులి వెంకట నర్సయ్య, మాసారపు లక్ష్మణరావు, పాలపాటి గోవర్ధన్, మేడి వెంకటేష్, షేక్ మక్బుల్, బి. భార్గవ్, మాసారపు రవి, వెంకటేశ్వర్లు, తాళ్ళూరి వెంకటేశ్వర్లు, సాయన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన చమురు ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి




తల్లాడ, మే 18, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం పెంచిన చమురు ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన తల్లాడలో టియూసిఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్‌మియా మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం 5 రాష్ట్రాల ఎన్నికల తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి దేశ ప్రజలపై భారం వేసిందన్నారు. మోడీ వేసిన పన్నుల భారాన్ని రద్దు చేయాలని, ప్రజలంతా వ్యతిరేకించాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ తల్లాడ బ్రాంచి కమిటీ నాయకులు రాఘవ, రామకృష్ణ, రమణ, వెంకటేశ్వర్లు, బాబు, కృష్ణ, నారాయణ, బడేమియా తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బారి నుండి మండల ప్రజలను రక్షించండి

నర్సంపేట, మే 18, ప్రభాతవార్త

క్యాన్సర్ బారి నుండి మండల ప్రజలను రక్షించండి ప్రజా వాణిలో ఆర్డీఓకు వినతి పత్రం అందించారు. సోమవారం నర్సంపేట రెవెన్యూ డివిజనల్ ఆఫీసులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నర్సంపేట డివిజన్ స్వచ్ఛంద సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ అన్ని మండలాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టి క్యాన్సర్ బారి నుండి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఉమారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ స్వచ్ఛంద సంస్థల బాధ్యులు గిరిగాని సుదర్శన్, రాజశేఖర్‌లు మాట్లాడుతూ అతి పలుచని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్స్, బిర్యానీ కవర్లలో ఘన, ద్రవ వేడి వేడి టీ, కాఫీ, సాంబార్, ఆహార పదార్థాలు తినడం, త్రాగడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులతో పాటు క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయని నిపుణులైన డాక్టర్లు తెలియజేస్తున్నారని వారు అన్నారు. మండలాల్లో ఉన్న ఉన్న ఫంక్షన్ హాల్స్, టెంట్ హౌస్‌లలో సిరామిక్, స్టీల్ గ్లాసులు ఉండేటట్లు తగు చర్యలు చేపట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. వినతి పత్రానికి స్పందించిన ఆర్డీఓ ఉమారాణి మాట్లాడుతూ సంబంధిత మండలాల అధికారులతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ కొరకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టుతామని ప్రత్యామ్నాయ మార్గాలు కూడా చూపెట్టి ప్రజా ఆరోగ్యాన్ని రక్షిస్తామని తెలిపారు.

## మద్యం మత్తులో ఉరి వేసుకొని యువకుని మృతి....



.... కోదాడ, మే 18, ప్రభాతవార్త :

మండల పరిధిలోని చిమ్మిరియాల గ్రామంలో ఉరివేసుకొని ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిమిర్యాల గ్రామానికి చెందిన గుడిమెట్ల గోపి( 29) గత 2 సంవత్సరాలు నుండి మద్యానికి బానిస అయి ప్రతి రోజు త్రాగి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఆదివారం ఉదయం సమయంలో మృతుని భార్య రమ్య నల్లబండగూడెం లో తన తల్లి గారింటికి వెళ్లగా, మృతుని తల్లి విజయమ్మ పాలకేంద్రం వద్దకు పాలు పోయడానికి వెళ్లగా ఇంటిలో ఎవరు లేని సమయం చూసి మృతుడు తన ఇంటిలో బెడ్ రూం లో ఫ్యాన్ కి చీరతో ఉరి వేసుకున్నాడు. ఈ లోపు తల్లి విజయమ్మ ఇంటికి వచ్చి బెడ్రూంలో చూసేసరికి కుమారుడు ఫ్యాన్ కి వేలాడుతుండడం తో స్థానికుల సహాయంతో కోదాడలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో ఖమ్మం హాస్పిటల్ కి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి గుడిమెట్ల విజయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



తుర్కపల్లి, మే 18 ప్రభాతవార్త

తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో లెంకల గీతారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని కూలీలు ఉదయాన్నే వచ్చి త్వరగా పనులను పూర్తి చేసుకొని వెళ్లాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ రమేష్, పంచాయతీ కార్యదర్శి చిక్కుడు రోజా, ఫీల్డ్ అసిస్టెంట్ పాంగల కరుణాకర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు

## తల్లాడలో 2 కె రన్ విజయవంతం

తల్లాడ, మే 18, ప్రభాతవార్త

తెలంగాణ రైసింగ్ మరియు స్పోర్ట్ అథారిటీ తెలంగాణ ఆధ్వర్యంలో తల్లాడలో సోమవారం నిర్వహించిన 2 కె రన్ విజయవంతమైంది. ఆదివారం రాత్రి కార్యక్రమం విజయవంతం కోసం అధికారులు చేసిన కృషి



ఫలించడంతో శనివారం కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎంపిడిఓ అంబటి శ్రీధర్‌రాజు, తహశీల్దార్ టి. కరుణాకర్‌రెడ్డి, ఎంఈఓ ఎన్. దామోదర ప్రసాద్, తల్లాడ కార్యదర్శి ఆర్. హరికృష్ణ ర్యాలీకు అగ్రభాగాన నిలిచి కార్యక్రమం విజయవంతంలో కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ పౌరుని నుండి ప్రతి ఒక్కరు వారి జీవితంలో ఉరుకులు, పరుగులతో సాగుతుందని ప్రతి మనిషి శారీరక, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ పాఠశాల నుండి బయలుదేరిన ర్యాలీ రింగ్ రోడ్డు మీదుగా ఆర్టీసి బస్టాండ్ కొత్తగూడెం రోడ్డు నుంచి తిరిగి జిల్లా పరిషత్ పాఠశాలకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో తల్లాడ ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, కోటగిరి ప్రవీణ్, తాళ్ళూరి రామారావు, పంచాయితీ కార్యదర్శి ఎస్‌కె. సిద్దిఖ్ మియా, సత్తెనపల్లి శివ, ఏపూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

నడిగూడెం, మే 18, ప్రభాతవార్త:

నడిగూడెం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు కందాల కృష్ణ అనారోగ్యంతో మృతిచెందడం పట్ల ఖమ్మం జాగృతి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కేశగని రాజశేఖర్ సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 5,000ల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నడిగూడెం ఆర్ఎంపీ , పీఎంపీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు దున్న వీరబాబు, అధ్యక్షులు ఏ. శ్రీరాములు, కార్యదర్శి సైదులు, కోశాధికారి వీరబోయిన సైదులు, డి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాఘవ చికిత్స పొందుతూ మృతి....

. ఆలేరు మే 18 ప్రభాతవార్త :



ఆలేరుకు చెందిన పులివలువుల రాఘవ(20) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు అతని బంధువులు తెలిపారు. ఈనెల 16న రాత్రి సిద్దిపేట జిల్లా చేర్యాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీసాహిత్ అనే ఎంబీబీఎస్ విద్యార్థి మృతి చెందగా మరో ఇద్దరు బీటెక్ విద్యార్థులు పులివలువుల రాఘవ, కొండోజు అక్షయ్ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చేర్పించారు. రాఘవ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో రోదనలు మిన్నంటాయి. అవయవ దానం చేసేందుకు రాఘవ తల్లితండ్రులు ముందుకు వచ్చారు. అక్షయ్ క్రమంగా కోలుకుంటున్నట్లు సమాచారం

## కోరుట్లలో జోరుగా క్రికెట్ బెట్టింగ్

### వేలాది రూపాయలను నష్టపోతున్న రోజువారి కూలీలు

### పర్యవేక్షణ కరువు.. పట్టించుకునేవాళ్లే లేరు

### రూ. 1000 కి రూ. 2000




కోరుట్ల, ప్రభాతవార్త :

ఐపీఎల్ సీజన్ నడుస్తుండడంతో కోరుట్ల పట్టణంలో జోరుగా క్రికెట్ బెట్టింగులు సాగుతున్నాయి. క్రికెట్ బెట్టింగ్ లపై కన్నేయాల్సిన పోలీసులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూ ఉండడంతో ఈ బెట్టింగులు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. పట్టణంలో ముఖ్యంగా రోజువారి కూలీ పనులు చేస్తున్న వారిని టార్గెట్ గా పెట్టుకొని ఈ బెట్టింగులు నిర్వహిస్తున్నారు. బెట్టింగ్లో పాల్గొంటే రూ. 1వెయ్యికి రూ. 2000 అంటూ సుమారు 10వేల వరకు బెట్టింగ్లు చేస్తూ కుటుంబాలను ఛిద్రం చేస్తుకుంటున్నారు. ఈ బెట్టింగ్ నిర్వాహకులు కూలీలు ఉండే ప్రాంతానికి వెళ్లి వారి పేర్లపై ఆయా టీమ్లను సెలక్షన్ చేసుకుని వారికి మరుసటి రోజు తెల్లవారుజామున గెలిచిన వారికి డబ్బులు నేరుగా ఇస్తుండడంతో ఇది చూసిన మరి కొంతమంది కూలీలు చేసిన పనికి వచ్చిన కూలీ డబ్బులను బెట్టింగ్ లో పెడుతూ నష్టపోతున్నారు. ఇంత తతంగం జరుగుతున్న ఈ బెట్టింగులపై కనీసం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు అధికారులు. ఈ బెట్టింగ్ల విషయంలో పోలీసులు శ్రద్ధ చూపితే ఈ బెట్టింగులు అరికట్టే అవకాశం ఉంది. ప్రధానంగా లేబర్లని టార్గెట్ చేస్తున్న బెట్టింగ్ నిర్వాహలను పోలీసులు గుర్తించి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

